శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

అపార కృపాకరా!



# కృప

ఆరాధనోత్సవ సంచిక

పంచుకున్న ఆనందమే... సద్గురుపథంతో పెంచుకున్న అనుబంధం

# సద్గురువు

శిష్యుడు గురువుని ప్రేమించడం గొప్పకాదు. ఎందుకంటే గురువులో అతడు ఒక అద్భుతాన్ని దర్శిస్తాడు. రక్షణ, ప్రేమలను అనుభవిస్తాడు. గురువు యొక్క ప్రజ్ఞకు ముగ్ధుడవుతాడు. గురువు కూడా శిష్యుని అంతగా ప్రేమిస్తాడు. ఒకప్పటి తన స్థితి ఇప్పటి తన శిష్యునిలో గుర్తించి, తాను నడిచిన పథంలో, తాను పడిన బాధలు పడకుండా గమ్యం చేర్చాలని ప్రయత్నిస్తుంటాడు. అదే వారి అవ్యాజ కరుణకు నిరూపణం. (స్వచ్ఛమైన శ్రీసాయిబాటను అందరూ నడిచే రాచబాటగా సుగమం చేసి మనకందిస్తున్నారు శ్రీబాబూజీ). ఇది విశ్వప్రభుని అనంతకరుణ. ఆ కరుణ గురువు ద్వారా నిరంతరం, నిత్యమూ ప్రవహిస్తూ – ప్రతిఫలిస్తుంటుంది శిష్యుని జీవనంలో. అందుకే గురువుని జీవనది అన్నారు పెద్దలు.

తానున్న స్థితికి తన శిష్యుడు కూడా చేరితే ఆనందించేవాడు, చేరాలని తపించేవాడు, చేర్చాలనే ప్రయత్నంతో **("మీరడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను. నేను ఇవ్వదలచినది మీరు అడిగేంతవరకు" అన్నారు శ్రీసాయి.)** మన కోసమే భూమిపై అవతరించిన వారు సద్గురువు. మన యోగ్యతకు తగినట్లుగా, మనల్ని నేర్పుతో – మనలో మార్పును కలగచేసి ఆయనంత వారుగా తీర్చిదిద్దేవారు సద్గురువు. అందుకే అంటారు శ్రీబాబూజీ "మన సంస్కారాలకు, పరిణితికి అనుగుణంగా లాలించి, బుజ్జగించి, బోధించి తీర్చిదిద్దడమే బాబా యొక్క ప్రత్యేకత" అని.

– గురుకృప




సంపుటి : 18
నవంబర్ 17

# కృప

సంచిక : 5
2015




## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీబాబూజీ



లోపలి పేజీలలో


సత్యాన్ని అంటిపెట్టుకో 4
\- గురుకృప

"పతనం"....... 6
\- శ్రీబాబూజీ

గురువుగారి సాధనలో తొలి సోపానాలు 8
\- శరశ్చంద్రికలు

గురుకృపాలహరి 20
\- గురుకృప

గురుబంధువు 24
\- గురుకృప

అంతరంగం 29
\- గురుకృప



నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# సత్యాన్ని అంటిపెట్టుకో

"ఎల్లప్పుడూ సత్యాన్ని అంటిపెట్టుకో"... – శ్రీసాయిబాబా. "**Nothing is more precious than truth**". - Sri Babuji. "**Truth is greater than Tapa & Japa**". - SriSaibaba అన్న సూక్తులు వింటున్న మనం, మననం చేస్తున్న మనం, అర్థమెరిగి పరిణితి తెచ్చుకుంటూ మానసిక పరివర్తన తెచ్చుకోగలుగుతున్నామా? సత్యాన్ని అంటిపెట్టుకోవడం అంటే వర్తమానంలో ఉండటం. దీన్ని మన పెద్దలు ఆశీర్వచనంతో చెప్పారు. "నభూతో... నభవిష్యతి..." అంటూ. అంటే వర్తమానంలో ఉండమనే. మనం ఎప్పుడూ భవిష్యత్ గూర్చిన ఊహలతోనో, గతించిన విషయాల ఆలోచనలతోనో, బాధతోనో, సంతోషంతోనో ఉంటాం. అలా కాదేమో ఉండవలసింది. ఉన్న క్షణంలో ఉండడం, ఆ క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించడం. ఇంకా... ఇంకా ఆలోచిస్తుంటే.. ఆలోచన అంటే ఇక్కడ మనకు తెలిసిన అర్థాన్ని ఆచరిస్తుంటే, మదింపు జరుగుతుంటే, అట్టి ఆచరణతో కూడిన మథనం మనల్ని ఇంకా లోతులకు తీసుకుపోయి, అసలైన పరమార్థాన్నిస్తుంది. సత్యాన్ని అంటిపెట్టుకోవడం అన్నా... వర్తమానంలో నిలవడం అన్నా మన కళ్ళముందున్న దాన్ని ఉన్నట్లు చూడగలగడం. అలా కాక ఆ వ్యక్తి పట్ల మనకున్న అభిప్రాయంతో చూస్తుంటాం. వాడు మంచివాడనో, చెడ్డవాడనో, అందగాడనో, వికారి అనో, ధనవంతుడనో, పేదవాడనో, తెలివిగలవాడనో, తెలివితక్కువవాడనో, పనికిమాలినవాడనో, ఇలా ఏవో భావాలు మన మనసులో ముద్రించుకుపోయిన భావాలతో చూస్తూ ఉంటాం. అంటే మన స్మృతి పథంలో (గత అనుభవాలతో) చూస్తున్నవాళ్లమే కాని, వర్తమానంలో ఉన్నవారం కాదు. ఇది మనం ఇంకా అర్థం చేసుకునేందుకు బుద్ధ భగవానుడు ఆచరణతో బోధించిన వృత్తాంతం చూద్దాం.

ఓ ఊరిలో ఓ వ్యాపారి, అతని కొడుకులు బుద్ధుని దగ్గర శిష్యులుగా చేరి, ధ్యానంలో మునిగి ప్రశాంతంగా ఉంటున్నారు. వ్యాపారి అయిన తండ్రికేమో తన బిడ్డలు ధనవంతులు కావాలని కోరిక. వారి సమయం వృధా చేస్తున్న బుద్ధునిపై విపరీతమైన కోపం వచ్చి అతనికి గుణపాఠం చెప్పాలని బయలుదేరతాడు. తీరా బుద్ధుని సమక్షానికి చేరగానే అతని ఆలోచనలన్నీ మటుమాయమై పోయాయి. కోపంతో ఉడికిపోతున్నా, నోట మాటరావడం లేదు. ఇక భరించలేక బుద్ధుని ముఖంపై ఉమ్మి వేసాడు. బుద్ధుడు చిరునవ్వు నవ్వాడు. శిష్యులు మాత్రం భరించలేకపోయారు. కానీ బుద్ధుడు ఎదురుగా చిరునవ్వుతో ఉంటే వారు మాత్రం ఏం చేయగలరు? మౌనం వహించి ఊరుకున్నారు.

ఒకసారి తన గురువును ఒకతను విమర్శిస్తుంటే, విన్న అతనికి కోపం వస్తుంది. ఆ తరువాత అతను గురువు దర్శనంలో గురువుగారితో విషయమంతా చెప్పి, 'కోపం భరించలేకపోతున్నాను' అంటాడు.



**జీవితాన్ని ఎలా చూడాలో, ఒక సందర్భాన్ని ఎలా విశ్లేషించుకోవాలో, మన ఆలోచనా విధానం ఎలా ఉండాలో, సత్యాన్ని దర్శించడం ఎలానో వారి స్వాధ్యాయ ప్రవచనాదుల ద్వారా నేర్పుతున్నారు మహాత్ములు.**

అప్పుడు గురువుగారు ఇలా "ఎందుకయ్యా నీకంత కోపం. నిన్ను కాదుగా అన్నది, నన్నేగా" అని అంటారు. ఆ తరువాత ఆ విమర్శించిన వ్యక్తి గురువుగారి వద్దకు వస్తాడు. అది చూచిన అతను గురువుగారిని గమనిస్తుంటాడు. గురువుగారు ఆ విమర్శించిన వ్యక్తిని చక్కగా ఆశీర్వదించి పంపుతారు. ఆ తరువాత అతనితో "శత్రువైనా, మిత్రుడైనా నాది ఒకే దీవెన" అంటారు. సాయి సంకల్పంతో వారి వద్దకు వచ్చిన వారు తప్ప, నచ్చినవారు, నచ్చనివారు అంటూ ఏ భావం లేక వచ్చిన వారి అవసరానికి స్పందించడం తప్ప 'వేరు' లేనివారు గురుదేవులు. ఇది గమనించుకున్న మనం అలా ఉండేందుకు ప్రయత్నం చేయడం లేదంటే.. గురువుగారి గుణసౌందర్యం, గుణ వైభవం చూచినవారమా? అది ఎంత స్వీకరించాము అంటే.. నలుగురికి చెప్పుకోగలిగినంతేగాని, మనల్ని ఆచరణయుక్తుల్ని చేసుకోనేంతగా స్వీకరించలేదు వారు ఆచరించి బోధించిన దానిని. అందుకే పెద్దలన్నారు 'ఎంత చెట్టుకు అంత గాలి'. మనం ఎంత చేసామో... అంతే పొందగలం. ఏమి విత్తామో అదే మనం పొందగలం.

ఇక ఆ వ్యాపారి అక్కడ నిలవలేక ఇంటికి చేరాడు. రాత్రంతా నిద్రపట్టలేదు. జీవితంలో మొదటిసారి, తాను ముఖంపై ఉమ్మి వేసినా చిరునవ్వుతో ఉన్న వ్యక్తిని చూసాడు. వణికిపోయాడు. మనస్సంతా అల్లకల్లోలమయింది. ఎంత అంటే నిద్రించలేక.. ఉదయాన్నే వెళ్ళి బుద్ధ భగవానుని పాదాలపైపడి క్షమించమని వేడుకుంటాడు. అప్పుడు బుద్ధుడు "నేను క్షమించలేను" అన్నారు. ఇది విన్న శిష్యులు అవాక్కయ్యారు. క్షమాగుణానికి మారుపేరైన బుద్ధుడు, ప్రపంచంలో అందరినీ క్షమించే బుద్ధుడు, ఈ వ్యక్తిని క్షమించలేకపోవడమా? అనుకున్నారు. అప్పుడు బుద్ధుడు అతన్ని లేపుతూ, "క్షమించడానికి అవసరమైన పనేమీ నీవు చేయలేదు" అంటారు. కానీ వ్యాపారి అంగీకరించక, నిన్న తాను చేసిన పనిని (అపచారాన్ని) గుర్తు చేసాడు. పూజా విధానంలో ఉన్న పంచోపచారాల (ధూప,దీప,గంధ, పుష్ప,నైవేద్య) లక్ష్యం తెలియకుండా చేస్తే అవి వ్యర్థోపచారాలుగా మిగులుతాయి. అప్పుడు బుద్ధుడు ఇలా "నిన్న ఆ పని చేసిన వ్యక్తి ఈ రోజు లేడు. ఈ రోజు ఉన్న నీవు నాకు ఏ అపకారమూ చేయలేదు" అన్నారు. ఇలా "మహాత్ముల చర్యలు అగాధాలు" అన్నది అర్థం అవుతుంది కదా!

ఒక వ్యక్తిని తప్పు చేసావు అని నిరూపించి, తర్వాత క్షమించడం క్షమ అనిపించుకోదు. నీవు క్షమించిన విషయం సైతం ఆ వ్యక్తికి తెలియకుండా జరిగిపోవాలి. తప్పు చేసామనే భావనే పెద్ద శిక్ష. వివేకం (జ్ఞానం) అనేది ఈ భావాన్నుంచి తప్పించి, జీవితాన్ని విశాల దృక్పథంలో చూసేలా చేస్తుంది.

**గురువనగా సత్యమే. గురుపథము సత్యమునకు సోపానము.** **– గురుకృప**

**మహాత్ములకు ఎవరిపైన ఓ స్థిరమైన అభిప్రాయం ఉండదు. కనుకనే వారు వర్తమానంలో ఉండగలరు. మానవుడు పరిణామశీలుడు అన్న సత్యాన్ని నమ్మిన వైనం వారి ప్రవర్తనాదుల్లో వ్యక్తం అవుతుంది.**



## “పతనం” కావడం అంటే ఏమిటి?

**భక్తుడు : గురువుగారూ! మాకేదన్నా కష్టం వచ్చినపుడు, ఎక్కువ దుఃఖం వచ్చినపుడు చాలా బాధేస్తుంటుంది. అందుకే బాబా, ‘నా బిడ్డలను నేను పతనం కానివ్వను’ అని అన్నారు కదా సార్!**

**గురువుగారు :** అంటే పతనం కావడం అంటే కష్టాలు రావడమనా? నాకర్థం కాలేదు. కష్టం వస్తే పతనమై పోయినట్టా? కష్టాలకు, పతనానికి కనెక్షన్ ఏమిటమ్మా? అసలు పతనం అంటే ఏంటి అనే దాన్ని గురించి ఒక క్లారిటీ తెచ్చుకోండి. ఆ పతనం అనే పదానికి, కష్టాలు అనే దానికి కూడా ఒక డెఫినిషన్ తెచ్చుకోండి (తెలుసుకోండి).

కష్టాలు... ఇంట్లో జరుగుబాటు కష్టంగా ఉంది సార్, నాకు ఇబ్బందిగా ఉంది సార్, ఏదైనా ఉద్యోగం చూపించండి సార్, అని అడిగేవాడూ ఉన్నాడు. నాకు వెయ్యి కోట్లు ఉన్నాయి. నాకు 80 కోట్ల బిల్లులో 80 కోట్లు ఎక్స్‌పెక్ట్ చేస్తే 75 కోట్లే వచ్చింది. నాకేంది సార్ ఈ కష్టాలు. నేనీ టెన్షన్ భరించలేకున్నాను సార్! నాకు 5 కోట్లు నష్టం వచ్చింది సార్. నిజానికి చెప్పాలంటే 20 కోట్ల లాభం వస్తుందనుకుంటే, ఆ 20 కోట్లలో 5 కోట్లు తగ్గింది. 15 కోట్లే వచ్చింది. (వాడి దృష్టిలో 5 కోట్లు నష్టమట) నాకెందుకు సార్ బాబా ఇలా పరీక్ష పెడుతున్నారు సార్? నన్ను మీరు కాపాడండి సార్! అని అడిగేవాడూ ఉన్నాడు నా దగ్గరకొచ్చి. “ఏవయ్యా కష్టాలు? ఇక్కడ పాతగా ఉండేటటువంటి వాళ్లలో, ఎక్కడన్నా ఒక ఉద్యోగం వచ్చి ఒక 5 వేలు, పదివేలు ఉద్యోగం వస్తే చాలా హ్యాపీగా ఉంటుంది సార్. నాకేదన్నా ఉద్యోగం చూపించండి సార్” అని అడిగిన వాళ్ళూ ఉన్నారు. (ఒక పదిహేను, ఇరవైఏళ్ళ క్రితం)

ఈ రోజున ఒక ఇల్లు అయిపోయింది సార్, ఇంకో ఇల్లు కట్టుకుంటున్నాను సార్, ఎందుకో వీలుపడటం లేదు, కొంచెం నా క్రెడిట్ కార్డు లోన్సు ఎక్కువైపోయాయి సార్, కొద్దిగా సాల్వ్ చేయండి సార్, నా ప్రాబ్లెమ్స్. ఏంటి సార్ నాకే ప్రాబ్లెమ్స్? నేనింతకు ముందు చాలా హ్యాపీగా ఉండేవాడిని సార్! ఈ మధ్య బాబా నాకు విపరీతంగా కష్టాలు పెడుతున్నారు సార్! అని అడిగేవాడూ ఉన్నాడు. ఇవి కష్టాలయ్యా!



**ఎప్పటికప్పుడు మనల్ని మనం దృష్టిలో పెట్టుకొని, మనల్ని మనం ఆత్మపరిశీలన చేసుకొంటూ చేస్తే సత్సంగం కరెక్ట్‌గా ఉంటుంది.**

నాకు 'కష్టం' అంటే ముందు ఒక డెఫినిషన్ ఇవ్వండి. కష్టం రాగానే బాబాని వదిలేస్తాడా? వదిలేసేవాడు వదిలేస్తాడు. అది వేరే విషయం. అసలు కష్టము, నిజంగా అది కష్టమా, ఎంతమందికి నిజంగా కష్టాలున్నాయో చెప్పండి నాకు. ఇంతకుముందు ఆయన ఏమేమి కష్టాలు తీర్చాడు, మనల్ని ఎలా పెట్టాడు, అన్నీ మర్చిపోతాం. మర్చిపోయి, ఏవో చిన్నవి ఇటువంటివే, ఇటువంటి లేనివన్నీ దానిమీద పెట్టుకుంటాము. ఇంకా ఏమీ అడగడానికి లేక మాకు, ఫ్లైట్‌లో విండో సీటు కావాలి సార్! మాకు ఫ్రంట్ సీటు కావాలి సార్! అని అడిగేవాళ్ళు ఉన్నారు. మేము శిరిడీకి పోతున్నాం సార్! మాకు రిజర్వేషన్ టికెట్లు దొరికేటట్లు చూడండి. ఇవయ్యా కష్టాలు?

నేను చెప్పేటటువంటిది, రెండో ఇల్లు కట్టుకోవడం తప్పని చెప్పడంలేదు. ఎంజాయ్ చెయ్యండి. ఉన్న ఇల్లుని ఎంజాయ్ చేస్తూ, రెండో ఇల్లు కట్టుకోండి. ఒక ఇల్లు కట్టేసుకొని, దాన్ని మర్చిపోయి, రెండో ఇల్లు లేదే, అని ఏడవకండి. అది నేను చెప్పేది. అప్పుడు కంప్లీట్‌గా ఎంజాయ్. అప్పుడు ప్రతిక్షణం, అనుక్షణం ఆనందమవుతుంది. This is a bird in hand. ఎప్పుడూ ఆనందంగా ఉంటాం. ఆనందజీవనం సాయిపథం. అప్పుడు మీరు సాయిపథంలో ఉన్నట్లు లెక్క. ఏడ్చుకుంటూ ఉండేవాడు కాదు. ఎన్నన్నా ఇవ్వనీ, నాకది లేదు సార్ అంటుంటాడు, అంతకుముందు ఇచ్చినవంతా పోతాయి. చిన్న పిల్లలు ఇలా అడుగుతారు, ఇటు తీసుకొని, అటు పెట్టుకొని, దాన్ని ఇలా జేబులో పెట్టుకొని, మళ్ళా ఇలా అంటాడు. నాకు గ్రీన్‌కార్డు రాలేదుసార్... ఏంది సార్... నాకిట్లా? వాడికొచ్చింది సార్! అదింకా బాధ.. (నవ్వులు). వీడికి రాలేదని కాదు, వాడికొచ్చిందని... ఇది కష్టం కాదు. గ్రీన్‌కార్డు కోసం ప్రయత్నం చేయడం తప్పని నేను అనడంలేదు. ఏడవకండి.

**పతనం అంటే కష్టం రావడం కాదు. మానవత్వం లేకపోవడం. ప్రేమ లేకపోవడం, అన్ రీజనబుల్‌గా దురాశ కలిగి ఉండటం. ప్రక్కన వాడి కష్టాన్ని మనకనుకూలంగా ఎక్స్‌ప్లాయిట్ చేసుకోవడం. ఇవి పతనాలంటే. – శ్రీబాబూజీ**

**బాబా యొక్క స్మరణలో ఉండటానికి, బాబాను గుర్తుపెట్టుకోవడానికి,**
**బాబా పట్ల మన ప్రేమను పెంచుకోవడానికి,**
**బాబాకు మరింత దగ్గర కావడానికి ఒక సాధనం - సత్సంగం - శ్రీబాబూజీ**



# శరశ్చంద్రికలు

## గురువుగారి సాధనలో తొలి సోపానాలు *అక్టోబర్ 2015*

గురువుగారు తమ అంతరంగిక అనుభవాలగురించి చాలా అరుదుగా ప్రస్తావించేవారు. సత్సంగాలలో అదృష్టవశాత్తు అప్పుడప్పుడూ గురువుగారి వ్యక్తిగత అనుభవాలగూర్చిన ప్రశ్నలు రావడం, వాటికి ఆయన సమాధానాలు ఇవ్వడం జరిగేది. తమ సాధన తొలినాళ్లలో గురువుగారి ఆంతరంగిక జీవితానికి, బాబా దగ్గరకు ఆయన ఎలా వచ్చారు అనే అంశాలకు సంబంధించి గురుదేవులు ఇచ్చిన సమాధానాల సమాహారమైన ఈ మాసం 'శరశ్చంద్రికలు' మనకు ఎన్నో అద్భుతమైన విషయాలను తెలియజేస్తాయి.



**భక్తుడు :** గురువుగారూ! మీ అన్వేషణ ప్రారంభమైన తొలి సంవత్సరాలలో మీరు దేనికోసం అన్వేషిస్తున్నారనే విషయంలో మీకు స్పష్టత ఉండేదా?

**గురువుగారు :** ఉండేది. నాలో ఏదో ఒక వెలితి ఉన్నట్లు అనిపించేది. 'ఏదో' లోపించినట్లుండేది. ఒక విధమైన అసంతృప్తి, విసుగు ఉండేది. వివిధ మార్గాలలో సంతోషం కోసం ప్రయత్నించేవాళ్లను చూసేవాడిని. ఆయా మార్గాలలో వాళ్లు ఆనందాన్ని పొందుతున్నట్లు కనిపించేవారు. అందుకని నేను కూడా నాకు కావలసింది ఈ ఆనందమా, ఆ ఆనందమా? అని ఆయా మార్గాలలో ప్రయత్నించి చూసాను. కానీ ఆ మార్గాలలో ఒక్కటి కూడా నాకు ఖచ్చితంగా ఉపయోగపడదని స్పష్టమయింది.

అయితే రకరకాల దారులను చూపే సూచన బోర్డుల (sign posts) వంటివి ఉండేవి. కొన్నిసార్లు దేనికోసం అన్వేషిస్తున్నానో స్పష్టంగా తెలిసేది. తరువాత హఠాత్తుగా అంతా అస్పష్టమైపోయి నేను తిరిగి అయోమయంలో పడిపోయేవాణ్ణి. ఆ తరువాత, "ఓ, ఇప్పుడు తెలిసింది. చాలా స్పష్టంగా ఉంది!" అనిపించి నా అన్వేషణ తిరిగి ప్రారంభమయ్యేది. కానీ మరికొంతకాలానికి మళ్లీ అస్పష్టత చోటుచేసుకునేది. అలా ప్రయత్నించి విఫలం కావడం, తిరిగి ప్రయత్నించడం, విఫలం కావడం, తిరిగి ప్రయత్నం చేయడం...

**భక్తుడు :** గురువుగారూ! మీరు అంత తీవ్రంగా అన్వేషించడానికి గలకారణం ఏమిటి?

**గురువుగారు :** నాలో సమాధానపడని ప్రశ్నలు చాలా ఉండేవి. ప్రతీదీ ఒక ప్రశ్నలాగా, ఒక చిక్కుముడిలాగా, ఒక మిస్టరీగా (మార్మికంగా) అనిపించేది.

**భక్తుడు :** అంటే ఎలా గురువుగారూ?

**గురువుగారు :** ప్రతి విషయమూ అంతే! నేను ఎందుకు శ్వాస తీసుకుంటున్నాను? ఈ తెలుపు రంగును, ఆ నలుపు రంగును ఎందుకు చూడగలుగుతున్నాను? నేను ఎలా మాట్లాడగలుగుతున్నాను? ఎలా వినగలుగుతున్నాను? ప్రతిదీ ఒక నిగూఢమైన విషయంగా కనిపించేది? నేను ఎందుకు నిద్రపోతున్నాను, ఉదయాన్నే ఎందుకు నిద్రలేస్తున్నాను? ఏం జరుగుతోంది? నాకు ప్రతిదీ ఒక సమస్య ఎందుకైందో చెప్పడం కష్టం (గురువుగారు నవ్వుతూ...) నేను ఈ విషయాలను అర్థం చేసుకునే ప్రయత్నంలో దాదాపు మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా మారాను.

నేను ఆ రోజులలో శాస్త్రాలను చదివేవాడిని. జీవితం యొక్క నిగూఢతత్త్వాన్ని గ్రహించామని చెప్పేవారిని ప్రశ్నించేవాడిని. కానీ నేను వాళ్ళను కలిసినపుడు వాళ్ళెవరూ ఈ విషయాలగురించి కనీసం ఆలోచించలేదని, వారికెప్పుడూ ఇవి అసలు మిష్టరీగా అనిపించలేదని, అసలు ఆ ఆలోచనే రాలేదని తెలిసింది.అసలు నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలిగేవారెవ్వరూ కనపడలేదు. వాళ్ళు కేవలం వేదాంత పరిభాషలో ఏదో ఉపన్యాసాలిచ్చేవారు.

**భక్తుడు :** గురువుగారూ! అసలు మీరు ఏం తెలుసుకోవాలనుకున్నారు?

**గురువుగారు :**: నాకు అనుభవమవుతున్న ఈ విసుగు ఏమిటి? నాలోని కొరత ఏమిటి? నా జీవితంలోని సమస్యేమిటి? జీవితం పట్ల నేను ఎందుకింత అసంతృప్తితో ఉన్నాను? నేను ఈ పరిస్థితిని ఎదుర్కోవాలనుకున్నాను, దానినుండి తప్పించుకోవాలనుకోలేదు. ఇప్పుడు మన మధ్య జరుగుతున్న ఈ సంభాషణ కూడా ఒక రకంగా వేదాంతమే. జ్ఞానం కోసం చేసే ఏ అన్వేషణైనా వేదాంతమే.

**భక్తుడు :** కానీ గురువుగారూ, మీరు పొందినది మీ ప్రశ్నలకు సమాధానమా? లేక అది ప్రశ్నలను సమూలంగా లేకుండా చేసిందా?

**గురువుగారు :** నిజానికి వేదాంతాన్ని చదవడం ద్వారా నేను పామును వదిలి పుట్టను కొట్టడం జరిగిందని, వేదాంతంలోని ప్రశ్నలయొక్క సమాధానాలకు, నా ప్రధానమైన సమస్యకు ఎటువంటి

**మన హృదయాల్లో నాటబడ్డ బాబా పట్ల ప్రేమ, జీవితతత్త్వం పట్ల అన్వేషణ అనే విత్తనాలు ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్నాయి. అవి సరిగా పెరిగి పుష్పించి, ఫలాలనివ్వాలంటే, ఆ మొలకలను కంచె కట్టి కాపాడుకోవాలి. ఆ కంచె - సత్సంగం - శ్రీబాబూజీ**



సంబంధం లేదనీ తెలిసింది.

**భక్తుడు :** గురువుగారూ! బాబాతో మీకు గలఅనుబంధం మీకు ఎప్పుడు స్పష్టంగా తెలిసింది?

**గురువుగారు :** నేను నా గురువును (ఆచార్య ఎక్కిరాలభరద్వాజ మాష్టరుగారిని) కలుసుకున్న తర్వాత స్పష్టమైంది.

**భక్తుడు :** అది మాష్టరుగారిని కలుసుకున్న తక్షణమే జరిగిందా?

**గురువుగారు :** అది అంత త్వరగా జరగలేదు. దానికి కారణమేమిటంటే నేనప్పటికే చాలా పుస్తకాలు చదివి ఉన్నాను, చాలా ఆలోచించి ఉన్నాను, చాలా రకాలసిద్ధాంతాలను ప్రోగుచేసుకొని ఉన్నాను. ఒక క్రొత్త విషయాన్ని అప్పటికప్పుడు స్వీకరించడానికి ఇవన్నీ నాకు అడ్డంకులుగా మారాయి. అంతకుముందే రకరకాలసిద్ధాంతాలను ప్రోగుచేసుకున్నందువలన మాష్టరుగారిని కలుసుకునేటప్పటికి నేను ఫ్రెష్‌గా లేను, క్రొత్త విషయాన్ని స్వీకరించడానికి సంసిద్ధంగా లేను.

**భక్తుడు :** బాబాతో అనుబంధాన్ని మీరు గాఢంగా అనుభూతి చెందారు. మీకు అప్పటికే ఉన్న ఈ రకరకాలభావనలు (ఆలోచనలు) వాటికై అవే తొలగిపోయాయా?

**గురువుగారు :** నిజానికి బాబాతో నా అనుబంధానికి, నాకున్న ఆలోచనలకూ ఎటువంటి సంబంధం లేదు. బాబాతో నా అనుబంధం మేధస్సుకు సంబంధించిన స్థాయిలో ఏర్పడలేదు. అంతే కాకుండా నా ప్రశ్నలకు మూలం, నేను నిస్సారమైన వేదాంత సిద్ధాంతాలను చదవడానికి, వినడానికి చాలా అలవాటుపడి ఉన్నాను. కానీ అవి ఎందుకో నా మనస్సులో నాటుకోలేదు. ఈ వేదాంత గ్రంథాలన్నీ ఆ పరబ్రహ్మతత్వం మనోవాక్కులకు అతీతమైనదని, అగ్ని దహించలేదని, గాలి కదల్చలేదని, నీటితో తడపజాలదని, ఆలోచనలకు అతీతమైనదనీ, ఆలోచనలకు అందనిదనీ చెప్పేవి. ఇదంతా వినడానికి ఎంతో అద్భుతంగా ఉంటుంది. కానీ నేను, "ఒకవేళ అది మనస్సుకు, ఆలోచనలకు అందకపోతే దాన్ని గురించి మాట్లాడటం ఎందుకు? అది అన్నింటికంటే అంత అతీతమైనదయితే దాని గురించి ఆలోచించడం ఎందుకు? మనం ఆ పరబ్రహ్మం గురించి ఎందుకు పట్టించుకోవడం? ఆ పరబ్రహ్మస్వరూపుడు మన గురించి ఎందుకు పట్టించుకోవాలి? మనం అనవసరంగా ఆయనను ఎందుకు విసిగించడం? ఆయన మనలనెందుకు విసిగించడం? ఆ భగవంతుణ్ణి హాయిగా ఆయన స్వర్గంలో విశ్రాంతి తీసుకోమనండి. నా సంగతి ఏమిటి? నా సమస్యకు పరిష్కారం ఏమిటి? నేను



**వాతావరణం అనుకూలించకున్నా, చివరకు తుఫాన్ వచ్చినా సరే - నియమం తప్పకుండా గురువుగారు సత్సంగం చేసుకునేవారు, క్రమం తప్పకుండా సత్సంగానికి వెళ్ళమని అందరికీ సూచించేవారు గురుదేవులు.**

నా సమస్యను గురించి అడుగుతుంటే మీరు దేవుడి గురించి మాట్లాడుతున్నారు. నాకు ఆయనతో సంబంధం లేదు. నా సంగతి చెప్పండి, ముందు నా సమస్యకు పరిష్కారం చెప్పండి" అని అడిగేవాడిని. (నవ్వులు...) వాళ్లు దానికి, "మీరెవరో మీకు తెలియకపోబట్టి ఈ సమస్య వచ్చింది" అని సమాధానం చెప్పారు. "సరే, నా అసలు స్వరూపమేమిటో నాకు తెలియదు, కానీ నేనెవరో నాకు తెలియకపోవడం నా సమస్య కాదు. ఇప్పుడు నేనేమిటో నాకు తెలుసు, దీని గురించి నాకు సందేహం లేదు, నాకు నిరాశానిస్పృహలు. అసంతృప్తి అనుభవమవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?"

"కాదు, కాదు, నిన్ను నువ్వు పరబ్రహ్మస్వరూపంగా, పరమాత్మస్వరూపంగా భావించుకోవాలి. పరమాత్మకు ఇవేవీ అంటవు" "అలా నేనెలా అనుకోగలను? నన్ను నేను ఫలానా ఫలానా అని నన్ను నమ్మించుకోమని (హిప్నటైజ్ చేసుకోమని) చెబుతున్నారా? ఇలా నన్ను నేను నమ్మించుకోవడం (హిప్నాటిజం) కోసం నేను మీ దగ్గరకు రాలేదు. ఎవరైనా సమస్య ఉన్నప్పుడు, 'నాకేమీ సమస్యలేదు, సమస్యలేదు, నేను ఎప్పుడూ ఆనందంగా ఉన్నాను, నేను ఎప్పుడూ సంతోషంగా ఉన్నాను,' అనుకోవడం సెల్ఫ్ హిప్నాటిజం. మీరు సెల్ఫ్ హిప్నాటిజం గురించి మాట్లాడుతున్నారు, వాస్తవస్థితిని గురించి మాట్లాడండి"

కానీ మాష్టరుగారితో అది విభిన్నంగా ఉండేది. ఇలా ప్రశ్నించే విధానాన్ని మొత్తం ఆయన వేరే కోణంలో చూసారు. నాకు తెలిసినంతవరకు అలా చూసినవారు ఎవరూ లేదు. ఆయన ఎప్పుడూ నాతో నిస్సారమైన తాత్విక సిద్ధాంతాలస్థాయిలో మాట్లాడలేదు. ఈ సిద్ధాంతాలను తుడిచి ప్రక్కనపెట్టి మూలాలలోకి వెళ్ళి అన్వేషణ  మొత్తాన్ని క్రొత్తపుంతలు తొక్కించారు. అదొక దృక్పథం, నాకది నచ్చింది. నేను ప్రోగు చేసుకున్న నిస్సారమైన విషయాలన్నీ తొలగిపోయి నా అన్వేషణ తిరిగి ఊపిరిపోసుకుంది, ఆ తరువాత నా అన్వేషణ తిరిగి క్రొత్తగా మొదలైంది.

**భక్తుడు :** మాష్టరుగారు కూడా సాయిబాబా భక్తులేనా?

**గురువుగారు :** అవును, ఆయన సాయిబాబా భక్తులు.

**భక్తుడు :** మాష్టరుగారు మిమ్మల్ని భక్తులుగా పొందారంటే ఆయన చాలా గొప్ప స్థాయి కలిగినవారై ఉంటారు.

**సత్సంగం చేస్తే మన ఆలోచనా విధానంలో, మన ప్రవర్తనలో, మన ఆచరణలో మార్పు రావాలి. ఆ మార్పు రాకుండా అయితే మాత్రం మీరు సరైన పద్ధతిలో సత్సంగ చేయడం లేదనే చెప్పాలి. మనలో పరివర్తన తేనటువంటి సత్సంగాలు అవసరం లేదు - శ్రీబాబూజీ**



**గురువుగారు :** ఆయన అంతటివారే. ఆయన సామర్థ్యం అమోఘమైనది. ఆయన చాలా గొప్ప వ్యక్తి. ఆయన నా గురువు. నేను దానికి గర్వపడుతున్నాను.

**భక్తుడు :** గురువుగారూ! మీరు మాష్టరుగారిని "ఆయన నా గురువు" అని వర్తమానంలో చెప్పారు.

**గురువుగారు :** అవును. ఆయన నా గురువు. ఆయన అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ నాకు గురువే.

**భక్తుడు :** మీ సద్గురువు?

**గురువుగారు :** గురువుకి, సద్గురువుకి వ్యత్యాసం ఉన్నట్లు నాకనిపించదు. బాబానే ఆ రూపంలో వచ్చి అవసరమైన దానిని తెలియచేసారనిపిస్తుంది.

**గురువుగారు :** నేను తీవ్రంగా ప్రశ్నించే స్థితిలో మాష్టరుగారి వద్దకు వచ్చాను. అక్కడ నాకు అనుభవం వచ్చిందంటే అది నా ప్రశ్నలు సమాధానపడడం వలన కాదు, అక్కడ మరేదో జరిగింది. ఒకరోజు నేను కూర్చుని మాష్టరుగారితో మాట్లాడుతున్నప్పుడు, ఆయన ప్రక్కనున్న బాబా ఫోటో వైపు చూస్తూ ఉన్నాను. నేను మాష్టరుగారితో మాట్లాడుతున్నప్పటికీ ఆ ఫోటో వైపు చూస్తూనే ఉన్నాను. అప్పుడు ఏదో జరిగింది! అప్పటివరకు ఉన్న అలజడి, చీకాకు తొలగిపోయింది. ఉదాహరణకు, మీకు మూడు, నాలుగు నెలలనుంచి తీవ్రమైన తలనొప్పి ఉందనుకోండి, అది ఉన్నట్టుండి మటుమాయమైతే ఎలా ఉంటుంది? అటువంటి అనుభవమది! నాకలా అనిపించింది. అంతకన్నా బాగా నేను దానిని వివరంగా చెప్పలేను. ఏం జరిగిందో నాకు తెలియదు. కానీ నాకు కలిగిన సాంత్వన మాత్రం బాబా చిత్రపటం నుండే వచ్చిందని అనుకున్నాను. కాబట్టి ఆయనను ఇంకా ఇంకా చూస్తూ ఉండాలనుకునేవాడిని. నాకప్పుడు బాబా గురించి ఏమీ తెలియదు. కానీ ఆయనలో ఏదో తెలియని ఆకర్షణ ఉండేది, నేను మాష్టరుగారితో మాట్లాడుతున్నప్పటికీ, వాదిస్తున్నప్పటికీ నా మనస్సు బాబా మీదనే ఉంది. నా మనస్సు మరింతగా మరింతగా శూన్యం కాసాగింది. (నేనే వాదిస్తున్నట్టుగా, నా మనస్సు, నా దృష్టంతా బాబా మీదనే  ఉండి జరుగుతున్న మొత్తం సంభాషణను నేను గమనిస్తున్నట్టుగా అనిపించింది.

**భక్తుడు :** అయినప్పటికీ మీరు ఆ వాదనను కొనసాగించగలిగారన్నమాట!

**గురువుగారు :** అవును. ఆ వాదన కొనసాగుతూనే ఉంది, నేనెలా వాదించగలుగుతున్నానని నాకు ఆశ్చర్యం వేసింది (నవ్వులు...) ఆ వాదన చాలా బాగుంది. మాష్టరుగారూ ఉత్సాహంగా ఉన్నారు.



**మహాత్ముని దివ్య సాన్నిధ్యంలో ఉండటం ఓ మహత్తరమైన 'సత్సంగం'. ఆ మహాత్ముని వాక్సుధను ఆస్వాదించడం అద్భుతమైన సత్సంగం. ఆ సన్నిధిలో సత్స్వరూపానందం అనాయాసంగా అనుభవమవుతుంది.**

ఎందుకంటే ఆయనకు అప్పటివరకు అలాంటి ప్రత్యర్థి దొరకలేదు. (గురువుగారు నవ్వుతూ...) ఆయన నన్ను "ఇంకా!ఇంకా!ఇంకా!" అంటూ వాదనకు ప్రోత్సహించారు.

**భక్తుడు :** గురువుగారూ! అప్పుడు మీ వయస్సు ఎంత?

**గురువుగారు :** దాదాపు 18సంవత్సరాలు. ఆ తరువాత నాలో ఏదో మార్పు జరిగింది, ఏదో సాంత్వన కలిగింది. ఆ 'తలనొప్పి' లాంటిది పోయింది. నాకు ఎప్పుడైనా కాస్త అలజడి అనిపిస్తే, మాస్టరుగారి రూముకు వెళ్లాలనిపించేది. నేను మాష్టరుగారి కోసం వెళ్తున్నానో లేక బాబా కోసం వెళ్తున్నానో నాకు తెలియదు.

**గురువుగారు :** నేను బాబానే నా గురువుగా భావిస్తాను. కానీ ఆ రోజులలో నాకు దానికి (ఆ భావనకు) ఒక నిర్దిష్టమైన వ్యక్తీకరణ కావాలి. ఆ వ్యక్తీకరణను నేను మాష్టరుగారిలో చూసాను. నాకు స్ఫూర్తినిచ్చింది, బాబా పట్ల నాలో ప్రేమను రగిలించింది మాష్టరుగారు. ఆయనను గ్రుడ్డిగా అనుసరించాలనిపించింది. నాకు దారి తెలియదు, నేను కళ్లు కనిపించని గుడ్డిమనిషి లాంటి వాడిని. మాష్టరుగారి సూచనలను నేను 'ఎందుకు? ఎలా?' అని ప్రశ్నించేవాడిని కాదు. నాకు ఒక గురువు దొరికారు. నేను ఆయనను అనుసరించాను. అంతే. ఆ మార్గమేమిటని ఎవరికి కావాలి? ఆయన కర్ర ఒక కొనను పట్టుకున్నారు, నేను మరొక కొనను పట్టుకొని ఆయనను అనుసరించాను. నేనాయనను అలా సేవించుకున్నాను నా గురువుతో నేను నడిచే మార్గంలో, ఆయన ఏది చేయమని చెప్పినా నేను దానిని ప్రశ్నించకుండా చేసాను. ఆయన నన్ను పెళ్లిచేసుకోమని చెప్పినపుడు కూడా మరో మాట లేకుండా ఆయన చెప్పింది చేసాను. అది నా మార్గం, అదీ నేను నడిచిన మార్గం. ఎటువంటి సాకులు, ఎటువంటి ఎంపికలు (ఇష్టాఇష్టాలు) లేవు. ఆయన ఒకరోజు, "శరత్, సత్సంగం బాధ్యత నీది, ప్రతి గురువారం నువ్వు వచ్చి ఏర్పాట్లు చేసి సత్సంగం చేయాలి" అన్నారు. నేను కోటలో ఉండేవాడిని. ప్రతివారం విద్యానగరం పోవలసి వచ్చేది. వర్షం వచ్చినపుడు చిన్న పడవలో ఏటి కాలువను దాటవలసి వచ్చేది. నాకు 103 డిగ్రీల జ్వరం వచ్చినా నేను వెళ్లేవాడిని, ఆరు సంవత్సరాలపాటు ఒక్కసారి కూడా వెళ్లకుండా ఆగలేదు. మా అమ్మానాన్నా, "ఏం చేస్తున్నావు నువ్వు? నీకేమన్నా పిచ్చి పట్టిందా? ఇంత జ్వరంతో వర్షంలో విద్యానగర్ దాకా ఎలా వెళతావు, సత్సంగం ఎలా చేస్తావు? తిరిగి ఎలా వస్తావు?" అని కోప్పడేవారు. "మాష్టరుగారు సత్సంగం

**"నన్నందరూ సాయిబాబా అంటారు" అన్న శ్రీసాయి మాటే శృతిప్రమాణంగా, సాయిని సాయిగా దర్శించేందుకు మన గురుదేవులు ప్రపంచానికి ప్రసాదించిన దివ్య సాధనం "సాయిబాబా... సాయి బాబా" అనే నామస్మరణ.**



చేయమని చెప్పారు, నేను వెళ్లాలనుకుంటున్నాను" అని చెప్పేవాడిని. చాలాసార్లు నేనొక్కడినే ఉండేవాడిని. కాని అక్కడ వందమంది ఉన్నట్టుగా ఏర్పాటు చేసేవాడిని, సత్సంగంలో మొత్తం పూజా కార్యక్రమాన్ని ఒక్కడినే చేసేవాడిని! భజన, పారాయణ అంతా నేను మాష్టరుగారి వద్దకు వెళ్లి, "నేను (మీ) మార్గంలో నడవాలనుకుంటున్నాను. నాకు మార్గం చూపించండి" అని అడిగిన తరువాత, ఆయన ప్రతీమాట, ప్రతీ సూచనా అది ఆధ్యాత్మికమైనా, ప్రాపంచికమైనా అది నాకు శాసనం.

**భక్తుడు :** సత్సంగానికి వెళ్లడం మీకు ఇష్టంగానే ఉండేదా?

**గురువుగారు :** మాష్టారుగారి సూచనను అనుసరించడమే ఆనందం. అందుకే నేను అలా సత్సంగానికి వెళ్లడం నాకు ఆనందంగా ఉండేది. అంతకు మించిన ఆనందం ఏముంది? మాష్టరుగారు తమ ఆదేశంతో నన్ను అనుగ్రహించారు. ఆ అవకాశం నాకు దక్కింది. కావున నేనదృష్టవంతుణ్ని.

**భక్తుడు :** గురువుగారూ! అది చాలా గొప్ప పరిణతిని సూచిస్తోంది.

**గురువుగారు :** అది పరిణితిని సూచిస్తోందో లేక వెర్రితనాన్ని సూచిస్తుందో నాకు తెలీదు. (గురువుగారు నవ్వుతూ..) నేను ఆదర్శాన్ని అనుసరించాను. అక్కడ మనమనుసరించే వ్యక్తి కాదు, ఆదర్శం ముఖ్యం.

**భక్తుడు :** మాష్టరుగారితో మీ అనుబంధం మొదలైన తొలినాళ్ళలో ఆయన మీకు బి.వి.నరసింహ స్వామిగారు రచించిన రమణమహర్షి జీవితచరిత్రను ఇచ్చారు. రమణుల జీవితచరిత్ర మీకు ఏం తెలియచెప్పింది? రమణుల జీవితం నుండి మీరు నేర్చుకున్న అంశాలేంటి?

**గురువుగారు :** ప్రేమ! అంకితభావం! ఏ బంధరహితమైన స్థితికోసమైతే నేను పరితపిస్తున్నానో ఆ స్థితిని సాధించవచ్చునని రమణమహర్షి జీవితం నిర్దిష్టంగా తెలియచేసింది. "ఓ, ఇది సాధ్యమవుతుంది!" అన్నది రమణులు నాకిచ్చిన స్పష్టత, ప్రోత్సాహం. మనిషిగా ఆ స్థితిని పొందడం సాధ్యమని వారు చూపించారు. నన్ను ఆకర్షించింది ఆయన బోధనలు కాదు, ఆయన జీవితం. ఆయన జీవితం వాస్తవికమైనది. అందరూ వేదాంతం గురించి, చాలా గొప్ప వేదాంతం గురించి మాట్లాడుతారు, కానీ అలా జీవించరు! అన్ని బోధలకూ మూర్తీభవించిన రూపమే భగవాన్ రమణులు.

**భక్తుడు :** మీ అన్వేషణలో పూండీస్వామి ప్రభావం ఎటువంటిది?

**గురువుగారు :** నా గురువు వెళ్ళమన్నారు కనుకనే నేను పూండీస్వామి వద్దకు వెళ్ళాను. ఆయన చెప్పారు, నేను చేసాను. అంతే! అక్కడ మరే ఇతర కారణం లేదు. నేను దానికంతటికీ బాబానే

కారణమని చెబుతాను. నన్ను పూండీస్వామి వద్దకు పంపించింది బాబా, అక్కడ పొందవలసింది ఏదైనా ఉంటే దానిని ఇవ్వవలసిన పూర్తి బాధ్యత ఆయనదే. ఆ అనుభవం పూండీలో శ్రీస్వామి ద్వారా వచ్చింది కాబట్టి నాకు పూండీతో ఆ అనుబంధం ఉంది. కానీ నేను అదంతా బాబా అనుగ్రహ ఫలితమేనని అనుకుంటున్నాను. ఇక్కడ చాలా సూక్ష్మమైన తేడా ఉంది, దానిని అర్థం చేసుకోవడం మీకు చాలా కష్టం. నా గురువును నేను గుడ్డిగా అనుసరించాను అని నేను చెప్పినపుడు, ఆ గుడ్డితనానికి మరో విభిన్నమైన గుణం ఉంది. అది వివేకం లేని గుడ్డితనం కాదు, నాకున్న పూర్తి వివేకంతో నేను ఆయనను అనుసరించాను. వివేకాన్ని చంపుకోవడం నా వ్యక్తిత్వ లక్షణం కాదు. నేను మాష్టరుగారిని వెయ్యి ప్రశ్నలు అడిగాను, వెయ్యిసార్లు ఆయనతో చర్చించాను, మేము దాదాపు పోట్లాడుకునేవాళ్ళం, కానీ అంతిమంగా నేనుఆయన చెప్పినట్లే చేసేవాడిని.

**భక్తుడు :** గురువుగారూ! మాష్టరుగారు మిమ్మల్ని అర్థం చేసుకున్నారని చెప్పారు. అంతేకాకుండా ఆ రోజుల్లో మీరు కలుసుకున్న వారందరిలో కేవలం ఆయన మాత్రమే మీ సమస్యను అర్థం చేసుకున్నారన్నారు. మాష్టరుగారు మిమ్మల్ని ఏ విధంగా అర్థం చేసుకున్నారు? అప్పటి మీ సమస్యేమిటి?

**గురువుగారు :** ఆ సమస్య గురించే మీరెందుకు ఆలోచిస్తున్నారు? ఆ పాత సమస్యనే పట్టుకొని ఎందుకు వ్రేలాడుతున్నారు? (గురువుగారు నవ్వుతూ..) అది ఇప్పుడు నా సమస్య కాదు. దాని గురించి ఇప్పుడు నేను చెప్పడం పొరపాటవుతుంది. ఎందుకంటే మీరు దానిని మీ సమస్యగా చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. నాకు వాస్తవమైన ఒక సమస్యను మీ మీద రుద్దదలచుకోవడంలేదు. నాకో సమస్య ఉండేది, నేను దానిని పరిష్కరించుకున్నాను. నా గురువు నాకు సహాయం చేసారు. నా సమస్య అందరికీ ఉండేటటువంటిది కాదు. అదీ అసలు సమస్య. (నవ్వులు...) అందుకే పరిష్కారం చెప్పేవాళ్ల సంగతి అటుంచి కనీసం నా సమస్యను అర్థం చేసుకునే వాళ్ళెవరో కనుక్కోవడం కూడా చాలా కష్టమైంది. మాష్టరుగారు నా సమస్యకు పరిష్కారం చెప్పారని నేను చెప్పలేదు. ఆయన నా సమస్యను సానుభూతితో అర్థం చేసుకున్నారు. అలా అర్థం చేసుకోవడం నన్ను ఆయనవైపుకు ఆకర్షించింది. ఆ రోజులలో నేను, అందరూ అదృష్టవంతులనీ నేనొక్కడినే దురదృష్టవంతుడననీ అనుకునేవాడిని. మిగతా వాళ్లందరూ వాళ్ల సమస్యలన్నీ పరిష్కారమయ్యి ఎంతో సంతోషంగా ఉన్నట్లు కనిపించేవారు. “నేను ఒక వెర్రివాడిలాగా వీటన్నింటి గురించి ఎందుకు.

**“బాబా, బాబా అని నీ గుండె లోతుల నుండి పిలువు. నీ హృదయంలో దాచుకున్న వేదనలు, కోరికలు ఆ పిలుపు గుండా బయటకు పడేట్లు పిలవాలి. అదే నామస్మరణ” అంటారు మన గురుదేవులు.**



**భక్తుడు :** గురువుగారూ! యువకులకు సాధారణంగా ఉండే సినిమాలు, ఆటలు, అమ్మాయిలు మొదలైన ఆకర్షణలు మీకు ఉండేవి కావా?

**గురువుగారు :** అంతకు ముందు (బాబా వద్దకు రాకముందు) ఈ ఆకర్షణలపట్ల అందరూ అంతగా ఆకర్షింపబడడానికి కారణమేమిటా అని వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవాడిని. అప్పుడు నాకు అటువంటి ఆకర్షణలు ఉండేవి. ఆ తరువాత నేను బాబా వద్దకు వచ్చాక అన్ని రకాలసాధనలు, అవి ఎంత కఠినమైనవైనా సరే వదలక చేయడం మొదలుపెట్టాను. నాకు సాధన చేయడమంటే, ఉదాహరణకు బాబా నామం చెయ్యడం అనుకోండి, దానిని ఇరవైనాలుగు గంటలు చెయ్యడం. నిద్రపోతున్నా అది కొనసాగాలి. నేను కాలేజీకి వెళుతూ ఉండడంతో నేను ధ్యానానికి పూర్తిగా సమయాన్ని కేటాయించలేకపోయేవాడిని. కానీ సెలవురోజుల్లో ఇరవైనాలుగు గంటలూ ధ్యానంలో కూర్చుని ఉండేవాడిని. ఆ సాధన గురించి పూర్తిగా తెలుసుకునే ఆ ప్రయత్నంలో కనీసం కదిలేవాణ్ణి కూడా కాదు. నేను ఇలా ప్రతి సాధననూ సంపూర్ణంగా చేసి అది నా సమస్యను పరిష్కరిస్తుందో లేదో చూసేవాడిని. నాకు చాలా రకాల అనుభవాలు వచ్చి ఉండవచ్చు. కానీ అవేవీ నాకు సంతృప్తిని కలిగించలేదు. ఆ రోజులలో నేను సినిమాలకు వెళ్ళేవాడిని కాదు. కనీసం నేను సినిమా పోస్టర్‌ను సైతం చూసేవాడిని కాదు! (గురువుగారు నవ్వుతూ...) నేనంత కఠినంగా ఉండేవాడిని. చెప్పులు వేసుకునేవాడిని కాదు. చలికాలంలో సైతం వేకువఝామున మూడు గంటలకే నిద్రలేచి చన్నీళ్లతో స్నానం చేసేవాడిని. నీళ్ళు ఇంకా చల్లగా ఉండడానికి కండలో పోసి ఆరుబయట పెట్టేవాడిని.

**భక్తుడు :** అలా చెయ్యడం వలన ఏం జరిగింది గురువుగారూ?

**గురువుగారు :** ఏం జరగలేదు. (గురువుగారు నవ్వుతూ..) ఆ తరువాత ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా నాకు ఫరవాలేదనిపించింది – ఇదొక్కటే దానివల్ల చేకూరిన ప్రయోజనం.

అంతకుముందు నేను స్కూల్లో కుస్తీ ఛాంపియన్‌గా ఉండేవాడిని. (నవ్వులు..) కుస్తీ నాకు బాగా నచ్చిన ఆట. ఆ రోజులలో బాక్సింగ్, కరాటే ఇటువంటి సాధనలవలన ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. నేను ఎంత కఠినంగా ఉండేవాడినంటే వారపత్రికల కవర్ పేజీలను కూడా చూసేవాడిని కాదు. అవి నా కళ్ళముందున్నా సరే, కావాలని వాటిని చూడకుండా వెళ్ళిపోయేవాడిని. మా నాన్నకు స్థానిక సినిమాహాలు ఓనరైన ఒక స్నేహితుడుండేవాడు. మా నాన్న సినిమా హాలుకు వెళ్ళి ఆయనతో



**"మన హృదయాల్లో బాబా పట్ల ఉన్న ప్రేమను, ఆర్తిని, ఆర్ద్రతను వ్యక్తం చేసుకునే సాధనే భజన" అంటారు మన గురుదేవులు.**

కలిసి కూర్చుని కాలక్షేపం చేసేవారు. ఒకవేళ నేను మా నాన్నను కలిసి ఏదైనా చెప్పాలంటే, నేను సినిమాహాలుకు వెళ్ళవలసి వచ్చేది – కానీ నా నియమం ప్రకారం నేనేమో సినిమాహాలు లోపలికి వెళ్ళను! నేను బయట నిలుచొని మా నాన్నను బయటకు రమ్మని వాచ్‌మెన్‌కు చెప్పి పంపేవాడిని. అక్కడుండే వాళ్లంతా మా నాన్నతో, "చూడు, భక్తుడు వచ్చాడు. బయటకు వెళ్ళు, అతను లోపలికి వస్తే అపవిత్రమవుతాడు, చెడిపోతాడు" అని హాస్యమాడేవారు. (నవ్వులు...)

**భక్తుడు :** మీ మనస్సులో ఇటువంటి ఆలోచనలు రావడానికి కారణమెవరు?

**గురువుగారు :** శాస్త్రాలన్నీ వైరాగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి చెబుతాయి. మా గురువుగారు కూడా ప్రోత్సహించేవారు. కేవలం పుస్తకాలలో చదవడమే కాదు, దానిని ఆచరణలో పెట్టడం! అదీ వైరాగ్యమంటే. దాని అంతు చూడాలి. ఇటువంటి ఆలోచనలు నా మనస్సులో పడడానికి శాస్త్రాలు కారణం. కొంతమంది వాటిని పనికిరాని విషయాలన్నప్పటికీ, నిజానికి నా మీద అవి సత్ప్రభావాన్నే చూపాయి.

**భక్తుడు :** ఇది జరిగింది ఎప్పుడు గురువుగారూ?

**గురువుగారు :** అది 1972 నుండి దాదాపు 78, 79 వరకు. అందరూ నేను పిచ్చివాడినైపోయానని అనుకునేవారు. అంతకుముందు నేను కాలేజీ రాజకీయాలలో, నాటకాలలో, సాహిత్య సంబంధ విషయాలలో చాలా చురుకుగా ఉండేవాడిని. అందరూ, "ఎంత మంచి పిల్లవాడు, ఇప్పుడు ఎలా అయిపోయాడో చూడు" అనేవారు. (నవ్వులు...)

**భక్తుడు :** ఇది పూండీ నుంచి వచ్చిన తరువాత విషయమా గురువుగారూ?

**గురువుగారు :** పూండీకి వెళ్లకముందు విషయం. పూండీ నుండి వచ్చిన తరువాత కూడా కొంతకాలం ఈ స్థితి కొనసాగింది. చాలా తక్కువ నిత్యావసరాలతో జీవించేవాడిని. దేనిగురించి ఆందోళన చెందేవాడిని కాదు. నేను తిరువణ్ణామలైలో అలాగే గడిపాను. జేబులో ఒక్క రూపాయి కూడా లేకుండా, కనీసం చేతిసంచి కూడా లేకుండా ఉన్నాను. ఇవేవీ లేకుండా కూడా నేను ఆనందంగా ఉ ండ గలననిపించింది. ఇలా జీవించడం వల్ల నాకు అంతటి ఆత్మవిశ్వాసం వచ్చింది. నేను చేసిన సాధనలు ఇదేగాక మరేదో కూడా ఇచ్చాయి.

**భక్తుడు :** మరేదో అంటే? అవి మిమ్మల్ని మరింతగా స్వీకరించడానికి సంసిద్ధులను చేసాయా?

**గురువుగారు :** అవును

**భక్తుడు :** ధ్యానస్థులు కావడం, ధ్యానంలోనే ఉండటం సులభంగా ఉండేదా, గురువుగారూ?

**గురువుగారు :** అవును నిస్సందేహంగా. కానీ ఆ సాధనలన్నీ అవసరం అని నేను చెప్పడంలేదు. నేను అంతకుముందు చెప్పినట్టు, చెట్టు మీద మామిడిపండును పదవరాయితో కొట్టడానికి నేను వేసిన తొమ్మిది రాళ్ళలో ఇవి ఒక రాయిగా

ఉపయోగపడ్డాయి. నాకు రాయి విసిరే కళను నేర్పించడానికి సహాయం చేసాయి. నేను ఎన్నో రకాలధ్యానపద్ధతులను, మంత్ర, తంత్ర, జపాలను సాధన చేసాను. కానీ నేను మరొక పద్ధతిని కనుగొన్నాను. అందుకనే మీకు నేను చేసినట్లే ఈ సాధనలన్నీ చేయమని చెప్పను. ఎందుకంటే అదే లక్ష్యాన్ని చేరుకోవడానికి వీటన్నింటికంటే సులభమైన మార్గాన్ని కనుగొన్నాను. అయినా మీరు ఇవన్నీ చేస్తానంటే చెయ్యండి, ఇబ్బందిలేదు. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** గురువుగారూ! మీరు ఆ పరిష్కారాన్ని కనుగొన్న తరువాత ఏం మార్పు వచ్చింది?

**గురువుగారు :** ఏం మారలేదు. ఏం జరిగిందనేది మాటలలో వ్యక్తం చేసేది కాదు. నాలో ఏది కొరతగా ఉన్నదో నేను దానిని పూండీలో పొందాను, నా అన్వేషణ ముగిసింది. ఏదో జరిగిందని కాదు. జరిగింది మాత్రం ఇది, నాకు అది సరిపోయింది. నా సమస్య తీరిపోయింది, ఆ తరువాత ఒక అన్వేషణంటూ ఏమీ లేదు. సంఘర్షణ ముగిసింది. నాలో ఉండిన అసంతృప్తి, విసుగు తరువాత లేవు. ఈ వివరణ సరిపోతుందనుకుంటాను. (నవ్వులు...)

**భక్తుడు :** గురువుగారూ! మీరు సాయిబాబా భక్తులు కావడానికి గల కారణమేమిటి? మిమ్మల్ని బాబా వద్ద ఆకర్షించేందేమిటి?

**గురువుగారు :** నాలో అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న పరిపూర్ణత్వ భావనకు వాస్తవరూపం బాబా. "నేను ముందు బాబాను ప్రేమిస్తే, ఆయన నా సద్గురువైతే, ఆ తరువాత బాబా నన్ను తరింపచేస్తారు" – బాబా గురించి నేనిలా ఎప్పుడూ అనుకోలేదు. మీరు అర్థం చేసుకోవడానికి ఈ పదాలను వాడుతున్నాను. నాకు ఇటువంటి ఆలోచనలు (భావనలు) లేవు. నాకు బాబా రూపాన్ని, ఆ ఆనందస్వరూపాన్ని చూడడమంటే ఇష్టంగా ఉండేది, అంతే. బాబా రూపం నాకు ఆనందాన్నిచ్చేది. ఎందుకని అడిగితే, అది నాకు తెలియదు. కానీ నేను చాలా ఆనందంగా ఉండేవాడిని.



**బాబా లీలను చదివినప్పుడు ఆ సందర్భంలో అక్కడున్న భక్తులలో ఒకడివై ఆ సన్నివేశాన్ని చూడగలగాలి. ఆ లీలా విలాసంలో మైమరిచి ఆనందిస్తూ, మమేకమవగలగాలి. అలా పరాయణత్వం కలిగించినప్పుడే అది పారాయణ – శ్రీబాబూజీ**

**భక్తుడు :** మీరు ఇష్టపడింది బాబా రూపాన్నా, ఆయన కనిపించిన విధానాన్నా లేక ఆయన జీవితచరిత్రనా?

**గురువుగారు :** బాబాలోని ప్రత్యేకత ఏమిటంటే మీరు బాబా జీవితచరిత్రలో ఎంతగా లోతుకు వెళితే, అంతగా అక్కడ బాబా అనే వ్యక్తి కనిపించకుండా పోతారు. మరేదో ప్రకటమవుతుంది – అది ఆయన ప్రబోధం కూడా కాదు. అప్పటివరకు నీలో అస్పష్టంగా ఉన్నదేదో ఒక రూపాన్ని – చాలా నిర్దిష్టమైన వాస్తవ రూపాన్ని సంతరించుకోవడం మొదలవుతుంది. బాబా జీవితంలో ప్రతి అంశం ఆయన స్థితికి వ్యక్తీకరణే. “అంతా బ్రహ్మం, ప్రతి ఒక్కరూ బ్రహ్మమే” అని చాలామంది చెప్పవచ్చు. కానీ ఇవన్నీ కేవలం మాటలు మాత్రమే. బాబా మాత్రం దానిని నిదర్శనాపూర్వకంగా నిరూపించారు, అప్పటికప్పుడు ఆ స్థితిని మనం ఆయనలో చూడవచ్చు. కానీ ఇలా ప్రకటం కావడం ఆయన భౌతికరూపంతో, ఆయన జీవితంతో ప్రారంభమయింది. బాబా రూపమంటారా, అవును. ఇప్పటికీ ఆయన రూపమంటే, ఆయన జీవితమంటే నాకు చాలా ఇష్టం.

**భక్తుడు :** కాబట్టి అది ఆయన రూపంతోనే ప్రారంభమయింది.

**గురువుగారు :** అవును, అది ఆయన రూపంతోనే ముగుస్తుంది కూడా. నిజానికి దానికి అంతంగానీ ఆరంభంగానీ లేవు. నేనేదో స్థితిని దాటానని, ఇప్పుడు రూపాన్ని వదలిపెట్టానని కాదు. ఆయన రూపానికి, ఆయన స్థితికి ఎటువంటి తేడా లేదు. ఎందుకంటే ఆయన స్థితిని వ్యక్తం చేసేది ఆయన రూపమే. నా వరకు రెండింటికీ తేడా లేదు. రూపం, స్థితి రెండూ బాబాలో సంపూర్ణంగా కలసిపోయాయి. ఆయన బోధించినదంటూ ఏమీ లేదు. “ఇదీ బాబా ప్రబోధం” అని నిర్దిష్టంగా మనం చెప్పలేము. కానీ ఆయన బోధించారు. మనం నేర్చుకోవడానికి, ఆనందించడానికి, అనుభూతి చెందడానికి, ప్రేమించడానికి బాబా దగ్గర చాలా ఉంది.

**పారాయణ ఒక మ్రొక్కుబడి తంతుగా చేయరాదు. బాబాలో వ్యక్తమయ్యే తత్త్వం ఏమిటి? బాబా ఏం చెప్పారు? ఒక లీల చదివినప్పుడు, ఆ భక్తుని స్థానంలో నేనుంటే ఎలా ఫీలవుతాను? ఇలా ప్రతి విషయాన్ని తర్కించుకుంటూ చదవాలి.**



# గురుకృపాలహరి

"సద్గురువు తమ భక్తులను తామే ఎన్నుకుంటారు. భారతీయ సాంప్రదాయంలో శిష్యుడు గురువు వద్దకు వెళ్ళి తనను స్వీకరించవలసిందిగా ప్రార్థించి వారి అనుమతికై పరితపిస్తుంటాడు. గురువును గుర్తించగలగడం మాటలకందని ఒక ఆకర్షణ, అనుబంధం, ఇష్టం. అది మనస్సుకు మాత్రమే తెలుస్తుంది. అప్పుడు నీకు, గురువుతో అనుబంధమేర్పడక ముందే ఆయన నిన్ను ఎన్నుకొన్నారనీ, గురువు ఎన్నుకొన్న తర్వాతే నీవాయనను వెతికి కనుగొన్నావనే అర్థమవుతుంది" అంటారు మా గురుదేవులు శ్రీబాబూజీ. గురుత్వాకర్షణ లేని సృష్టి – గురువు ఆకర్షణ లేని వ్యక్తి రెండూ ఒకటే! గురువంటే – గుర్తించేవాడు, మనల్ని మనలుగా సృష్టించేవాడు. పెరుముక్కల్‌లో విడిది చేసిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి దర్శనార్థం వెళ్ళిన సుబ్రహ్మణ్యంగారి కుటుంబానికి వారి ఆశీస్సులు ఎంతో మెండుగా లభించాయి. నిత్యపూజా విధులలో నిమగ్నమైన సమయంలో స్వామివారి ఆశీఃదృక్కుల జడివానలో ఆ కుటుంబం తడిసి ముద్దవుతూనే ఉంది. ఇదిలా ఉంటే ఒకానొక సమయంలో కొన్ని వేలమంది సమక్షంలో భక్తులందరూ చంద్రశేఖర సరస్వతీ స్వామివారిని దర్శించుకుంటుండగానే 'స్వామి' వారి తీక్షణమైన చూపులు 'గిని'పై వర్షించాయి. ఆ గురుశిష్యుల ప్రథమ దర్శనానుభూతిని 'గిని' మాటల్లోనే వారు పరమాచార్యులుగా వర్ధిల్లే రోజుల్లో "మా గురుదేవులు నన్ను చూడటం –నేను వారిని చూడటం – నాలో ఒక తెలియని గొప్ప ఆందోళన కల్గింది – వారితో నాకు కొన్ని జన్మల అనుబంధం ఉందని, వారిని విడిచి నేను ఉండలేనని – ఎల్లప్పుడూ వారిపాదాల చెంత ఉండి పోవాలని నా మనస్సు అభిలషించసాగింది" – ఎందుకంటే ఏమో తెలియని పరిస్థితి ఆ చిన్నారిది. కేవలం 13 సం॥ల బాలుడు – అతనిలో ఇన్ని సంఘర్షణలు – అర్థం కాని దృక్కోణాలు. **ఈశ్వర సంకల్పం – సద్గురు అనుగ్రహం – ఈ రెండూ తోడైతే వయసుతో పనేముంది. ప్రభవించదా సద్గురు ప్రేమ యశస్సు – తీరదా జీవుల పరితాప తమస్సు!** బిడ్డను ఎప్పుడు చూస్తానా అని గురువే ఎదురు చూస్తుంటాడు. మూర్తీభవించిన కరుణ కదా ఆ మూర్తి. సారూప్యం కాదు కానీ–ఎన్నో జన్మల సంబంధం మనదన్న శ్రీసాయిమాటలు – స్వామి బ్రహ్మానంద, వివేకానందస్వామి కోసం ఎదురు చూసిన శ్రీరామకృష్ణులు, శరశ్చంద్రుని రాకతో సంతసించిన ఆచార్య భరద్వాజగారు గుర్తొస్తున్నారు.



**ఆధ్యాత్మికత అంటే ప్రేమను అనుభవించడం, ప్రేమను వ్యక్తపరచడం. అది మనలను అన్ని రకాలుగా ఉత్తేజపరిచేది, స్పష్టమైన ఆనందం, తృప్తి అనుభమయ్యే దిశగా మనలను నడిపించేది – శ్రీబాబూజీ**

నిత్యపూజ ముగించుకున్నాక స్వామివారు సుబ్రహ్మణ్యంగారి కుటుంబానికి అంతరంగిక దర్శనమిచ్చారు. ఆ దర్శన సమయంలోనే మొదటిసారి 'గిని'తో మాట్లాడారు స్వామి. పీఠ పరివేష్టితులైన స్వామి – 'గిని'ని మూడు ప్రశ్నలు అడిగారట. "నీకు మార్కులు బాగా వస్తున్నాయా?" – వస్తున్నాయి. "నువ్వు లీడర్‌గా ఉన్నావా క్లాసులో?" – ఆ! లీడర్‌గా ఉన్నాను. "నువ్వు సంధ్యావందనం చేస్తుంటావా?" 'చేస్తున్నాను' అన్నాడు గిని. ఈ మూడు మాటలు చెప్పడానికి తదనంతర కాలంలో ఎప్పుడు ఉద్యుక్తులయినా పరమాచార్యులు ఎంతో తడుముకోవడం. మౌనముద్రాంకితులవ్వడం, మన మాటల్లో వర్ణించలేని ఒకానొక అనుభూతికి లోనవడం పరమాచార్య స్వామివారి భక్తులందరి అనుభవాల మాలలో పూజా పుష్పాలుగా దర్శనమిచ్చేవి. చంద్రశేఖర సరస్వతీ స్వామివారి ఈ ప్రశ్నలు – 'గిని' సమాధానాలు– వీటి గురించి భాష్యంగా ఎందరో పండితులు కొన్ని కొన్ని సభల్లో వ్యాఖ్యానంగా చెప్పేవారు. అన్నీ విన్న పరమాచార్యులనేవారు – "మీరందరూ గొప్ప గొప్ప పండితులు. మీరు వీటికి అర్థాలు చెప్పగలరు. నాకేమీ తెలుసు వారు ఎందుకు అడిగారో – వాటి అంతరార్థం చెప్పగలిగింది కేవలం వారే!" కుశల ప్రశ్నలు అయ్యాక, చంద్రశేఖరులు సుబ్రహ్మణ్యంగారితో ఇలా అన్నారు "ఈ చిన్నారి రాబోయే కాలంలో మహాపురుషునిగా వర్ధిల్లుతాడు" అని. అది విన్న తండ్రి ఎంతో మురిసి పోయాడు. వారి ఆనందానికి అవధులు లేవు. కానీ వారి ఆలోచనలో లేకపోయింది– పదమూడేళ్ళ బాలుడు సన్యసించి పీఠాధిపత్యం వహించే రోజుకు ఎంతో వ్యవధి లేదని. కొన్ని సంఘటనల వెనుక ఆంతర్యం మానవ మస్తిష్కానికి అవగతం కాదు. మనకు అర్థం కాదనే తలంపుతోనే గురుసాంప్రదాయ వర్తనులు ఎప్పుడూ గురువు మాటను జవదాటేవారు కాదు. జవదాటిన మాటలకు ప్రతికూల ఫలితాలు దర్శించాకగానీ అర్థంకాదు, గురువు మాటల్లో దాగిన భవిష్యద్వాణి. స్వామివారితో సంభాషణ అయ్యాక సెలవు పుచ్చుకునే సమయంలో సుబ్రహ్మణ్యంగారితో చెప్పారు చంద్రశేఖరులు – కుటుంబ సమేతంగా మీరు నన్ను దర్శించుకోవడానికి రాలేని సమయంలో కూడా "గిని"ని నా వద్దకు పంపుతూ ఉండండి అని! మారు మాట్లాడకుండా 'సరే' అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

విశ్వసించడమంటే మరేమిటి? పదమూడేళ్ల చిరుప్రాయంలో ఉన్న బిడ్డను ఎవరి సహాయం లేకుండా పంపడానికి సిద్ధం– అది గురుచరణాలపై ఉన్న శ్రద్ధా భక్తులకు సరియైన అర్థం. తదనంతర కాలంలో జరిగిన ప్రతీ పరిణామంలోనూ గమనిస్తే – చంద్రశేఖరులు తమ తదనంతరం 'గిని'ని

**ఆధ్యాత్మికత జీవితాన్ని సాధ్యమైనంత సంపూర్ణంగా అనుభవించేటట్లు చేస్తుంది. ఇంకా జీవితానికి నిండుదనాన్నిస్తుంది. జీవితంలో సంపూర్ణంగా పాలుపంచుకుంటూ, సంపూర్ణంగా జీవించడమే ఆధ్యాత్మికత అంటూ ఆధ్యాత్మికతలోని సరికొత్త కోణాన్ని సృజింపచేసారు మన గురుదేవులు.**



పీఠాధిపతిగా నిర్ణయించింది తమ ప్రథమ కలయికలోనేనేమో అనే సందేహం కలడగం సహజం. **దైవం మానుష రూపంలో ప్రభవిస్తే – గురుచంద్రుని దేదీప్యమాన అనుగ్రహ వెలుగులతో ధరాతలం శోభిస్తే అది లోక కళ్యాణమే కదా!**

తిండివనంలోని తమ ఇంటిలో ఒక రోజు ఉన్నట్లుండి 'గిని' కనిపించలేదు. కంగారుపడ్డ సుబ్రహ్మణ్యం దంపతులు, బంధువులు దగ్గరలోని అన్ని ప్రాంతాలలో చివరకు బావులు, చెరువుల వద్ద కూడా వెతికారు. నిద్రాహారాలు మరిచారు ఆ దంపతులు. రెండు రోజులు గడిచాక చంద్రశేఖరేంద్ర శ్రీచరణుల నుంచి కబురు అందింది. 'గిని' తమ చెంతకు వచ్చాడని! సౌఖ్యంగానే ఉన్నాడని – రెండురోజులు వారి చెంతన గడిపి ఇంటికి వస్తాడని! మహదానంద భరితులయ్యారు ఆ తల్లిదండ్రులు. **కన్నవారి ప్రేమ – జగమంతా ఉన్న వారి ప్రేమ. ఆహా! చంద్రశేఖరయతీంద్రా! నవజాత శిశువై సద్గురుని ప్రేమఒడిలో సేదదీరినావా సమ్యమీంద్రా!** సద్గురు సంకల్పానికి ప్రకృతిలోని ప్రతీ అణువు స్పందించవలసిందే! ప్రేరణ వారిదే! చీమ కదలినా వారి సంకల్పమే కదా!

అది 1907వ సంవత్సరం. ఫిబ్రవరి మాసం. సుబ్రహ్మణ్యంగారింటికి శ్రీమఠం నుంచి టెలిగ్రాము అందింది. పరివారంతో కలసి 'గిని'ని తీసుకుని అత్యంతావశ్యకంగా మఠానికి చేరమని– 66వ పీఠాధిపతులైన శ్రీచంద్రశేఖర సరస్వతీ స్వామివారి నుంచి అందిన వార్త సారాంశం. ఆ సమయంలో తిరుచ్చిలో ఉద్యోగరీత్యా క్యాంపులో ఉన్నారు సుబ్రహ్మణ్యంగారు. ఎంతో ముఖ్యమైన పని అయి ఉంటుందని తలచి సుబ్రహ్మణ్యంగారి స్నేహితులు ఆ కుటుంబాన్ని స్టీము ఇంజనులో కంచి పంపారు. విషయమేమంటే చంద్రశేఖర సరస్వతీ స్వామివారికి మశూచి జ్వరం వచ్చింది. ఆ రోజుల్లో మశూచి జ్వరం వస్తే అందుకు ఎటువంటి వైద్య సేవలు ఉండేవి కావు. గవర్నమెంట్ ఆదేశాల ప్రకారం ఆర్యోగవంతులెవరూ కూడా జ్వరం వచ్చినవారిని సమీపించడంగానీ, సేవలు చేయడంగాని నిషేధం ఉండేది. కంచిపీఠంలోని ఈశ్వర స్వరూపం (లింగము) యోగలింగం. శంకరులు కైలాసం నుంచి తీసుకువచ్చిన ఐదులింగాలలో ఇది ఒకటిగా భావిస్తారు. నిత్యమూ చంద్రమౌళీశ్వర లింగమును అభిషేకించి పూజించడం ఆచార్యుల కర్తవ్యము. ఈ కర్తవ్యము నిర్వహించవలసిన పీఠాధిపతులు ఋగ్వేద పరాయణులై, బ్రహ్మచర్యముననే సన్యసించిన వారై ఉండవలె. 'గిని' వాళ్ళ అన్నగారు (పెద్దమ్మగారి అబ్బాయి) శ్రీచంద్రశేఖర సరస్వతీ స్వామివారి అంతరంగిక భక్తుడై, శిష్యుడై, వేదపరాయణుడై, గురుశుశ్రూషా సేవాతత్పరుడై కామకోటి పీఠంలోనే ఉండేవారు. ఆ సచ్ఛిష్యుని



**ఆచారాల వెనుక నిద్రాణంగా ఉన్న ఆధ్యాత్మికపరమైన అంశాలను, సూక్ష్మాలను మేల్కొలిపి, వెలికి తీసి, మనం ఆచరించి, సాటివారికి తెలియచెప్పడం మన కనీస బాధ్యత – సిసలైన సదాచార పాలన! –శ్రీబాబూజీ**

పేరు లక్ష్మీకాంతన్. అతనికి తెలిసిన అంశాలు రెండే. ఒకటి వేదపారాయణ, రెండు సద్గురు సేవా పరాయణ. వారి గురుదేవులకు మశూచి రాగా ఆచార్యుల వద్దకు వెళ్లడానికి ఎవ్వరూ ధైర్యం చేయలేదు. అంతేగాక వారి శుశ్రూషకు లక్ష్మీకాంతన్‌ను వెళ్లవద్దని అందరూ వారించారు. లక్ష్మీకాంతన్ వయస్సు 18 సం॥లు. 18 సం॥లో ఉన్న యువకునికి, వేదపారాయణ చేయగలిగిన వానికి తెలియనిది ఏముంటుంది? మశూచి జ్వరం వస్తే మనిషి మనుగడ సాగించడం కష్టమని, వారిని సేవించిన వారికి కూడా అపాయమని తెలియని స్థితి అతనికి ఉంటుందా? గురువుని సేవించడం అంటే తమాషా కాదు. తెలిసీ, తెలియని రాసే పదజాలం కాదు! గొప్పలు చెప్పుకోవడానికి మాట్లాడే మాటల మాయాజాలం కాదు. గురు శుశ్రూష అంటే ఓ గొప్ప సాధన, మహోన్నత తపస్సు, మనోవాక్కాయ కర్మలను గురుచరణాల చెంత సమర్పించాలి, పంచ ప్రాణాలను సద్గురు పాదాల చెంత అర్పించగలగాలి. లక్ష్మీకాంతన్‌కు అట్టి శ్రద్ధా భక్తులను ప్రసాదించాడు ఈశ్వరుడు – స్వీకరించాడు ఆచార్యేశ్వరుడు. ప్రాణాలను లెక్క చేయక తన గురువుగారికి సేవ చేసేందుకు ఉద్యుక్తుడైన లక్ష్మీకాంతన్ ధన్యజీవి. శ్రీచంద్రశేఖర సరస్వతీ స్వామివారు అంతరంగికులను పిలిచి 'గిని', 'స్వామినాథన్' అనే పేర్లతో పిలువబడుతున్న 13 సంవత్సరాల బాలుని తమ తర్వాత పీఠాధిపతిగా నియమించవలెనన్న తమ అభీష్టాన్ని వెల్లడించారు. మిషనరీ స్కూలులో విద్యాభ్యాసము – బ్రిటీష్ కొలువులో పనిచేస్తున్న తండ్రి నవీన నేపథ్యము నుండి శంకరులు అధిష్టించిన పీఠ పరంపరాగత ఆచార్య స్థానమునకు ఈ బాలుడు సమంజసమా? కాదా? అన్న మీమాంసలో ఉన్న అంతేవాసులకు స్వామి చేతులమీదుగా ఆ బాలునికి ఇవ్వవలసిన కాషాయాంబరాలు ప్రసాదించారు. ఈశ్వరుని స్వరూపమున ప్రభవించిన ఆచార్యులకు ఈశ్వర మానసము అవగతమే కదా! తమ అవతార పరిసమాప్తికి సమయమాసన్నమైనదని తెలిసిన చంద్రశేఖరులు పైన ఉదహరించిన కార్యములను నిర్వర్తించి ప్రభవనామ సంవత్సరం – కృష్ణాష్టమి 1907వ సం॥లో సిద్ధి చేసే సమయమాసన్నమైంది. దైవలీలలు అంతుబట్టేవి కావు. గిని కంచి పీఠాధిపత్యం స్వీకరించాడా? ఏం జరిగింది? రాబోయే సంచికలో...

**లోకహితమే మహాత్ముల మతం. ధర్మ పరిరక్షణ, సత్ప్రవర్తన, జ్ఞానము, భక్తి, త్యాగము, మానవత, సజ్జనహిత, సచ్ఛీలతలను ప్రవర్తిల్ల చేయ మానుష రూపంలో అవతరించే వారే సద్గురువులు. సద్గురుపథం ఒక జీవనది, ఆగేది కాదది. సాగిపోయేది ... అందరినీ కలుపుకుపోయేది... గమ్యం చేర్చేది.. వృధాభరిత జీవుల దాహం తీర్చేది. – గురుకృప**

**ఏ కాలానికి అనుగుణమైన ధర్మాన్ని ఆ కాలంలో పాటించడం వివేకం. కాలధర్మం చెందిన ఆచారాలను పట్టుకొని వ్రేలాడటం అవివేకం. మనం మన సాంప్రదాయాలను గౌరవిద్దాం. అయితే వాటిలో శ్రీసాయిచే ఆమోదయోగ్యమైన వాటిని ఆచరిద్దాం – శ్రీబాబూజీ**



# గురుబంధువు

మీరు గురుబంధువు అన్న దానికి ప్రమాణం ఏమిటి?

మిమ్మల్ని గురుబంధువుగా, సాయిభక్తునిగా లేదా సాయిపథంలో నడిచేవిధంగా చేసేదేమిటి? మీకు మీ నడత ఎలా ఉంది?

మీ నడత భిన్నంగా ఉన్నదా?

మీరు నైతికంగా న్యాయబద్ధంగా వ్యవహరిస్తున్నారా?

ఏదో వారానికి ఒకసారి సత్సంగానికి వెళుతున్నాము.. లేదా మా దగ్గర నిరంతరం గురువుగారి ఫొటో పెట్టుకుంటున్నాము. మేము గురుబంధువులం అనంటే...

కాదు, నేను అలా అనుకోను!

నీతిగా, నైతికంగా ఉండే విధానంలో నేను చెప్పినట్టుగా మీరు ఉండగలుగుతున్నారా?

మీరు ఎదుటివారికన్నా, వేరుగా ఏవిధంగా ఉన్నారో, ఉండి చూపించండి. అప్పుడు మీరు గురుబంధువు అవ్వగలరు.

సామాన్య బంధువుకి, గురుబంధువుకి మధ్యనున్న వ్యత్యాసం ఏమిటి అంటే?

సామాన్య బంధువు మనకి తెలియకుండా మన నియంత్రణ లేకుండా కలుగుతాడు.

కానీ గురుబంధువుగా అవ్వడం అనేది నువ్వు సంపాదించుకున్నది. అది సంపాదించుకున్నది! దక్కినది కాదు.

మీరు సంపాదించగలుగుతున్నారా? ఏ విధంగా సంపాదించుకుంటున్నారు?

ఏ విధంగా మనం వేరుగా ఉన్నాము?

మీరు అబద్ధాలు చెప్పడం లేదా? మీరు ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం లేదా?

మీరు నిజంగా నైతికంగా ఉన్నారా?

మీరు ఎంత నిబద్ధతతో ఉన్నారో అని మిమ్మల్ని మీరు ఎప్పుడైనా ప్రశ్నించుకున్నారా?

ఇతరుల కన్నా ఏవిధంగా వేరుగా ఉన్నారు మీరు?

“నా సాంప్రదాయమే వేరు!” అన్నారు బాబా. ఏ రకంగా వేరు? అది మనం చూసుకోవడం లేదు.

కనీసం మనకి మనం అయినా ఆలోచిద్దాం.

మనం ‘వేరు’గా ఉన్నామా?

మనం గురు బంధువులమా?



**ఉపవాసమంటే - మనస్సును వ్యర్థమైన విషయాలతో నింపక, ఖాళీగా ఉంచుకొని, అందులో మన ఉపాసనా దైవాన్ని ప్రతిష్ఠించుకొని, ఆయనకు అంతరంగంలో దగ్గరవ్వడం. జాగరణ అంటే నిద్రను - తద్వారా మనస్సును నియమించే ప్రయత్నంలో జాగరూకులమై ఉండటం - శ్రీబాబూజీ**

మనం సాయిభక్తులమా?
అసలు సాయిభక్తుడంటే ఎవరు?
సాయిపథం అంటే ఏమిటి?
గురువుగారు ఏం చెప్పారు?
మనం ఆ బాటలో వెళ్తున్నామా?
కనీసం ప్రయత్నిస్తున్నామా?
దాని గురించి ఆలోచించండి చాలు! ఇక అంతా
బాబా చూసుకుంటారు. **– శ్రీబాబూజీ**

## దేనినీ ద్వేషించవద్దు

శ్రీరామరావణ యుద్ధం సమాప్తమయింది. రామ పట్టాభిషేకం అయింది. రాముడు తమ కులగురువు వశిష్టుని అడిగాడు "గురుదేవా! నన్నొక ప్రశ్న వేధిస్తోంది. అదేమిటంటే ఒకే వ్యక్తిలో వందల మంచి గుణాలు ఎలా ఉండగలవు? అని. అతనెవరిగురించి ప్రస్తావిస్తున్నాడో తెలిసినా పూర్తిగా తెలీనట్లుగా 'ఎవరి గురించి నాయనా రామా?' అన్నాడు. దానికి రాముడు అదేనండీ మీ ప్రియశిష్యుడు రావణుడి గురించి, అదే దేవుతల గురువు అగస్త్యుని ప్రియశిష్యుడు, సాక్షాత్తూ పరమశివుడికి నభూతో నభవిష్యతి రీతిలో ప్రియభక్తుడు అయిన రావణుడి గురించి అడుగుతున్నా. ఎంత అందంగా ఉంటాడు? ఎంత చదువుకున్నవాడు? ఢమఢమ విరాటవీటి పల్లకి లాంటి శివతాండవ స్తోత్రాన్ని రాసిన గొప్ప కవి. కొన్ని వందల పాటలకు సంగీతస్వరం చేకూర్చిన కవీశ్వరుడు, సంగీత విద్వాంసుడు. రావణ స్మృతి రాజనీతి కోవిదులకు సైతం ఒక మహోత్కృష్టమైన గ్రంథం. తల్లితో, సోదరులతో, సోదరితో, పిల్లలతో ఎలా వ్యవహరించాలి అన్నదానికి నిదర్శనం. రాజుకు రాజ్యంపైనా, రాజ్యప్రజలపైనా మమకారం ఉండాలేకానీ చుట్టాలమీద, ఆఖరికి కుటుంబసభ్యులపైనా ఉండకూడదని చెప్పడమే కాదు చేసి చూపించాడు. ఒకసారి అతను యుద్ధభూమిలో ఉండగా అతనికి విరుద్ధంగా శూర్పణఖ భర్త కనిపించాడు. ముందుగా బావగారూ.. మీరా.. అన్నా, మరుక్షణమే చుట్టాలు కాదు,

**మనిషి దైవంగా పెరగడం బాబా మతం- అని శ్రీసాయి అభిమతాన్ని చాటి.. సాయికి లేని కులం, మతం సాయి భక్తులకు మాత్రం ఎందుకు? అంటూ కులాల కుళ్ళు, మతాల మళ్ళు - మానవతకే ముళ్ళు, ముక్తికి సంకెళ్ళు అని సూక్తీకరిస్తూ... మతరహిత సమాజం కాదు, మతాతీత సమాజం కావాలి అని పిలుపునిచ్చారు గురుదేవులు.**



రాజ్యం అని గ్రహించి అతనిని హతమార్చాడు. తాను గాఢంగా ప్రేమించిన శూర్పణఖ విధవరాలయ్యింది. ఆమె పట్ల ఇంకా ప్రేమను పెంచుకున్నాడు. అరివీర పరాక్రమవంతుడు, ముల్లోకాలనూ అవలీలగా జయించగలిగినా, రాజ్యకాంక్ష లేదు.

మొదట్లో కార్తవీర్యార్జునుడు, వాలిలపై ఓడినా తరువాత మరెవ్వరిచేతిలోను ఓటమి చవిచూడని మహాపరాక్రమశాలి, యుద్ధనీతి కోవిదుడు... (నాకు సమయం, జాగాలు లేవుగాని, రాముడు ఇంకా ఇంకా చాలా చాలా చెప్పుకుపోయాడు) అంతా విన్న వశిష్ఠుడు రాముడితో ఇలా అన్నాడు... “రామా! నువ్వు అన్నట్లు రావణుడిలో అన్ని మంచి, గొప్ప లక్షణాలున్నా ప్రపంచం అతన్ని దుర్మార్గునిగానే వర్ణిస్తుంది. కారణమేమిటంటే, అతను చాలా గొప్ప భక్తుడు. కానీ, పరమ విష్ణుద్వేషి, కోటి శివలింగాలను పూజించాడు. కానీ, ప్రతి లింగంచుట్టూ ఒక పాము ఉంటుంది. పాము విష్ణువు ప్రతిరూపం. శివలింగాన్ని పూజించడానికి ముందు, అతను కసి, ద్వేషం, పగలతో రగిలిపోతూ, ఊగిపోతూ పాముని తన ఖడ్గంతో నరికేసి శివలింగాన్ని మాత్రమే ప్రక్కనపెట్టి అలాగే కోటి శివలింగాలను పూజించేవాడు. ఒక దైవాన్ని ఎంత భక్తి శ్రద్ధలతో పూజించినా, మరో దైవాన్ని కానీ, దేవుని ప్రతిరూపమైన ఏ జీవినైనా అంతలా అసహ్యించుకున్నా, ద్వేషించినా, మనిషిలోని మంచి గుణాలన్నీ భూస్థాపితమైపోయి అతను ప్రపంచానికి దుర్మార్గుడిగా, నీచుడిగా మిగిలిపోతాడు. అయితే సగటు మానవుడి దృష్టిలో రావణుడు క్రూరత్వం, నీచత్వం, దుర్మార్గాలకు ప్రతిరూపమైతే అదే రావణుడిలో ఇన్ని మంచి గొప్ప గుణాలు చూడగలిగావు కాబట్టే నువ్వు సగటు మానవుడివే అయినా ప్రపంచం నిన్ను మానవుడిగా కాక దేవుడిగా కొలుస్తుంది”

"Greatmen find sermons in stones, books in brooks, tongues in trees and enlightenment in entertainment and Good and God in Everything"

– మురళి



**సాయి అవతార కార్యంలో ప్రధాన అంశమైన సర్వమత సమరస భావాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించనిదే మనం ఎన్నటికీ సాయిభక్తులం కాలేము. సాయిభక్తులందరూ తమ కులం-సాయికులం, మతం-సాయిమతం అని సగర్వంగా చెప్పకోగలగాలి – శ్రీబాబూజీ**

# గురువు

భగవంతుని చేరే మార్గాన్ని చూపించేవారు సద్గురువు. గురువే బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు. పరబ్రహ్మకూడా. గురువు పాదాలపై మనసు నిశ్చలం కానివానికి ఎన్ని సంపదలున్నా, ఎంతున్నా మాత్రం ఏమిటి లాభం అంటారు ఆదిశంకరులు.

నాకు భగవంతుడు, గురువు ఇద్దరూ ఏకకాలంలో కనిపిస్తే ముందు గురువుకే నమస్కరిస్తాను, ఎందుకంటే భగవద్దర్శనానికి తగిన మార్గం చూపించింది గురువు కనుక అంటారు సంత్ కబీర్.

గురువు శరీరంతో ఉన్నది పదిమందిని ఉద్ధరించడానికే. ఆయనకు శరీరంతో పనిలేదు. తన జీవితంలో అనేక బోధలు చేసి, తానే స్వయంగా జీవనంలో ఆచరించి తనవారికి మార్గాన్ని చూపుతారు. ప్రతి మనిషికి తన జీవితంలో ఎదురయ్యే వేల ప్రశ్నలకు సమాధానాలను గురువు – ముందే చెప్పి ఉంటారు. ఇదే గురువుగారు చెప్పేది, “శ్రీసాయిభక్తి సాధనకు సంబంధించిన ఏ సందేహానికైనా సమాధానం, శ్రద్ధగా వెతికితే బాబా మాటల్లోనే మనకు లభిస్తుంది. మన జీవితమనే గ్రంధాన్ని అర్థవంతంగా, రసవత్తరంగా చదువుకునేందుకు అవసరమైన అంశాలపై బాబా చెప్పక విడచిన విషయం లేదు! శ్రీసాయిబోధ సమగ్రమైనదే, మన అవగాహనే సమగ్రం కావలసి ఉంది!” అని.

గురువుని ఏ విధంగా పూజించాలని సందేహం కలిగితే దానికి ఒక్కటే సమాధానం గురువు బోధలను జీవితంలో ఆచరించడం. ఆయన చెప్పినట్టు (చేయడం) జీవించడమే నిజమైన ‘గురుపూజ’. అదే మన గురువుకు మనం చేయగలిగిన, చేయవలసిన మహోన్నత పూజ. అదే నిజమైన ఆరాధన. అదే ఉత్సవం.... అదే ఆరాధనోత్సవం...

*గురుచరణాలు... సద్గురు చరణాలు... మా ఏలికలు*
*గురుచరణాలు.. సద్గురు చరణాలు...*
*అనుభవైకవేద్యమైన ఆనంద దీపికలు*
*అక్షరాల స్ఫూర్తినిచ్చే అక్షయ గీతికలు*
*గురుచరణాలు... సద్గురు చరణాలు...*
*గురుచరణాలు... సద్గురు చరణాలు... మా ఏలికలు*
*గురుచరణాలు... సద్గురు చరణాలు...*
*సదా అనుసరణీయాలు....*

**సాయిపట్ల ప్రేమను పెంపొందించి, సదా శ్రీసాయి ఊసు, ధ్యాసలో ఉండేట్లు చేయడమే సాధనా మార్గాల పరమలక్ష్యం. మన హృదయాంతరాళాల్లో ఉన్న ప్రేమను పైకి వచ్చేట్లు చేయడమే కాకుండా సాయి ప్రేమానుగ్రహాన్ని గుర్తించే హృదయ యోగ్యతను మనకు ప్రసాదిస్తాయి - శ్రీబాబూజీ**



సదా అనుస్మరణీయాలు
గురుచరణాలు... సద్గురు చరణాలు...
గురుచరణాలు... సద్గురు చరణాలు... మా ఏలికలు
గురుచరణాలు... సద్గురు చరణాలు...
గురుచరణాల తలవాల్చు.. సద్గురు చరణాల తలవాల్చు...
గత జన్మల పాతకములు పారద్రోలు... ఈ జన్మల గతి తీరు మారు...
గురుచరణాలు... సద్గురు చరణాలు...
గురుచరణాలు... సద్గురు చరణాలు... మా ఏలికలు
గురు చరణాలు ... సద్గురు చరణాలు...
గురు చరణాలు... సదా సేవితాలు...
సద్గురు చరణాలు... సదా పూజితాలు...
గురుచరణాలు... సద్గురు చరణాలు...
గురుచరణాలు... సద్గురు చరణాలు... మా ఏలికలు

## అనుమానం - అవమానం

### "దొంగతనం పాపం, అనుమానం మహాపాపం"

"దొంగతనం వలన ఎంత పాపం వస్తుంది? ఎవరి వస్తువు దొంగలించబడినదో వానికి దొంగతనం చేసినవానికీ వచ్చే పాపం కన్నా 20 రెట్లు ఎక్కువ పాపం వస్తుంది? ఎలా అంటే, వస్తువు పోతే దొంగ ఒకడే కానీ, 10 మందిని అనుమానిస్తాం. అంతేకాదు, మన మిత్రులు, కుటుంబసభ్యులు ఇంకో పదిమందిని అనుమానించడానికి కారణమవుతాము. అమాయకుడిని అనుమానించడం మహాపాపం కదా! అసలు పచ్చి నిజం చెప్పాలంటే ఏదైనా డబ్బుగాని, బంగారంగాని, నిర్లక్ష్యంగా వదిలేస్తే, సాధువుకి కూడా కోరిక పుట్టి దొంగవ్వచ్చు కదా! సాధువుని దొంగగా మార్చింది నీ అజాగ్రత్తే! కావున దొంగకన్నా పోగొట్టుకున్నవాడే మహాపాపి.

పనిమనిషి, రిక్షావాడు, చాకలి, ఇంటి ప్రక్కవాడు, వాచ్‌మన్–వీడూవాడు అని తేడా లేకుండా అందర్నీ అనుమానిస్తాం. పదిమందికీ చెప్పి టాం టాం చేస్తాం. దొంగ దొరికాక వీళ్ళమీద ఇతరుల హృదయాల్లో పడిన మచ్చని చెరిపేయలేముగా! అందుకే అనుమానం దొంగతనం కన్నా ఘోరమైన పాపం.




# అంతరంగం

నా హృదయ సామ్రాజ్యాన్ని అధిష్టించి, ప్రేమను నిగిడిస్తూ,
అనురక్తి కలిగిస్తున్న నా ప్రభువును సంకీర్తనా సుమాలతో
పూజిద్దామని సంసిద్ధమయ్యాను.. అటుపై,
అంతటా నిండినవారు నాలో గూడా ఉన్నారనే తలంపుతో తరచి
చూసుకొన్న వెనుక అనేకానేక భావనా సదృశాలు నాకు భంగపాటు కలిగించాయి.
అయినా, కనులలో ఎంత నింపుకున్నా ఇంకా ఇంకా నింపుకోవాలనిపించే
వారి చూడచక్కని రూపం,
ఎన్నిసార్లు విన్నా ఇంకా ఇంకా వినాలనిపించే శ్రావ్యమైన వారి నామం,
ఎంతమందితో పంచుకున్నా ఇంకా ఇంకా ఏదో చెప్పుకోవాలనిపించే
తరగని, తనివి తీరని వారి ఘనకీర్తి, ఇలా వారే సమస్తమై ఆర్తి కలిగించాయి.
ఆ ఆర్తిలో, వారిపై నాకు అంతులేని ప్రేమ ఉందని, నా హృదయమంతా
వారేనిండి ఉన్నారని తలపోసాను.
నాలోని ప్రేమ స్వచ్ఛతకు నేనే నిర్ణేతననే ఉన్మాదం తలకెక్కించుకున్నాను.
ఆ సమయాన, సుగంధ పరిమళాలతో నిండవలసిన ఆ సంకీర్తనా కుసుమం,
మొగ్గగనే (వారి పాదాలు చేరకుండానే) వాడి పోతుందేమోనన్న భయం,
ఆవేదన నా మనసును ఆక్రమించగా, వడివడిగా అర్చనకు అయాత్తమయ్యాను.
అలా అర్చించుకుని, హృదయంలో వారిని బంధించుకోవాలని ఆరాటపడుతున్న నాకు,
ఆ ఆరాటం నివ్వెరపోయేలా నా మనో వైకల్యం నాకు అవగతమైంది.
అందువారిని వడిసి పట్టలేక, చేసేది లేక, దిక్కుతోచక నిస్పృహ ఆవరించిన నిమిషాన,
ఓటమిని అంగీకరిస్తూ వైకల్యాలు సరిచేసుకొంటానని ప్రార్థిస్తూ దీనంగా వారివైపు చూడగా!
వారు అంతులేని ఆ నింగిలా - వారి ప్రేమ
అందున్న నీలి వర్ణంలా గోచరించింది నాకు.
అప్పటికి కానీ నాకర్థం కాలేదు నా హృదయం ఎంత మాత్రం వారిని నింపుకుందో.

**మీ సమస్యలకు తగిన పరిష్కారం చూపడం, కష్టాల్ని చేతనైనంత వరకు తీర్చడం,**
**ఇదంతా మీపట్ల, బాబా పట్ల, నాకున్న ప్రేమకు వ్యక్తీకరణగానే భావిస్తాను.**
**మీరందరూ నాకు బాబా ప్రతిరూపాలే - శ్రీబాబూజీ**



ఈ ఘట్టం వెనుక నా హృదయాన్ని విశాలం చేసుకొని వారిని
ఇంకా ఇంకా నింపుకోవాలన్న తలంపుతో
క్షణం ఆలస్యింపక బయలుదేరిన పయనంలో
ఎన్నో ఒడిదుడుకులు ఆశలు, ఆటుపోట్లు, పొరపాట్లు, దిద్దుబాట్లు.
ఎన్ని ఉన్నా తలెత్తి నింగిపైకి దృష్టి సారించగానే
అఖండిత తేజో విరాజితమై శత సహస్ర శరచ్ఛంద్ర యశస్సు
హృదయాన్ని పరుగులెత్తిస్తూ క్షణం ఆగనీయక లాక్కెళుతుంది. కానీ,
ప్రతి మజిలీలో హృదయ వైశాల్యాన్ని కొలుచుకుంటూ
వారి ప్రేమని ఇంకా ఒడిసి పట్టగలనేమో
అనుకుంటున్న నాకు ఆ ఆకాశంవైపు చూసిన ప్రతిసారీ నిరాశే మిగులుతుంది.
నా అల్పత్వం నాకు గోచరమవుతుంది.
ఆ వెలుగుకు తాళలేక నా వ్యక్తిత్వ లోపాల మాటున
సుఖ సంతోషాల మత్తులో దాగి, పయనం సాగిద్దాం అని అనుకున్న తరుణాన,
నన్ను వాటి నుండి బయటకు లాగి చిత్రవధ చేసి, తిరిగి గాడిలో పెట్టి
నా పయనం యొక్క గతిని స్థితిని తెలియపరుస్తున్నారు వారు.
ఉత్తమము అథమము... తప్పు ఒప్పు.. మంచి చెడు.. అను సంధికాలాన
సందిగ్ధంలో నాదైనది అనుకొన్నది ఏది పోయినా పర్వాలేదని
వారికై హృదయమంతా పరిచి  ఎదురు చూసిన తరుణాన
అమృతతుల్యమైన వారి దరహాసం నన్ను ఇంకా పరుగులెట్టిస్తోంది.
ఇదంతా తియ్యని బాధేనని బోధిస్తోంది.
చూసే ప్రతి చోటా వారి రూపే నన్ను ఆశీర్వదిస్తోంది.



~వారి ప్రేమలో ~

**గురుబంధువు**



**శ్రీసాయితో ఉన్న ఋణానుబంధమే మీ అందరినీ నా వద్దకు రప్పిస్తున్నది.**
**కనుక నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావిస్తాను.**
**మరి నేను మిమ్మల్ని ఒట్టి చేతులతో ఎలా పంపగలను?    - శ్రీబాబూజీ**

# జగద్గురో నమస్తుభ్యం

'జగద్గురు' అంటే జగత్తుకు గురువని ఒక అర్థం. 'జగత్తే గురువు'గా కలిగినవారు అని మరొక అర్థం కూడా ఉంది. 'విశ్వవిద్యాలయం' అంటే విశ్వమే విద్యాలయం. అంటే విశ్వంలోని ప్రతి అణువు గురుమయమే. (నేనే విశ్వమంతా ఆవరించి ఉన్నాను. ఈ విశ్వమంతా నాలోనే ఉంది అంటూనే... ఈ విశ్వమంతటా, అన్నిటా ఉన్న నన్ను గుర్తించి, ఆ గ్రహింపుకనుగుణంగా మసలుకుంటారో వారు నాకు ప్రీతిపాత్రులు అన్నారు శ్రీసాయి.)

నా దగ్గర ఇవ్వడానికి ఇంకేమీ లేదు. 'ప్రేమ' ఒక్కటే నాకున్న సంపద, స్వీకరించు. ఆ సంపద యొక్క అద్భుతం ఏమిటంటే అది పంచినకొద్దీ పెరుగుతుంటుంది. నిజమైన సంపద యొక్క లక్షణం అదే. ఒకవేళ ఇవ్వడం ద్వారా తరుగుతుంటే అది సంపదకాదు.

ప్రకృతే పరమగురువు అంటారు ఓ ఆంగ్లకవి. నేచర్ ఈజ్ ఏ టీచర్ అన్నారు. భాష వేరైనా, భావం ఒక్కటే. ప్రకృతికి ఇవ్వడమే కాని చేయి చాచి అడగడం తెలియదు. ఇచ్చేవాడికి సంపద వస్తూనే ఉంటుంది అన్నాడొక మహాగురువు.

గురువు – మహత్తరమైన ప్రేమ ప్రవాహం. అవ్యాజప్రేమ నిత్యమూ, నిరంతరం దివ్య భూమికలపై ప్రవహిస్తూనే ఉంటుంది. ఆస్వాదించే 'శక్తి' ఉన్నవారికి అనుభూతిలోకి, అందుబాటులోకి వస్తుంది. ఆ 'శక్తి' గురువు చెప్పినట్లు చెయ్యడం ద్వారా వస్తుంది. (అనుగ్రహం ఎప్పుడూ ఉంది. గురువు చెప్పినట్టు చెయ్యడం వలన అనుభూతి చెందగలవు. – శ్రీబాబూజీ)

గురువు నడిచి చూపిన బాటలో, అచంచల విశ్వాసంతో, తదేక నిష్ఠతో, ఆచరించి పరివర్తనను కలిగి, ఉన్నస్థితి నుండి ఉన్నతస్థితికి ఎదిగి, గురువుకు ఆనందాన్ని కలిగించిననాడే నిజమైన ఉత్సవం మన జీవితాలలో.. మన జీవనాలలో. అందుకు ఈ 'ఆరాధనోత్సవం'ను ఉపయోగపెట్టుకొందాం. వారి స్మరణ, స్ఫురణలతో స్ఫూర్తి పొందేందుకు ఈ ఉత్సవం ఉపకరించాలి.

– గురుకృప



గురువుగారు భౌతికంగా మన మధ్య లేకపోయినా, అసలైన గురుస్వరూపం
ఆయన తత్త్వమే... విధానమే... అలా వారి సంకల్పమూ,
వారి దయ, కరుణ, వారి మార్గదర్శకత్వం
మనకు ఎప్పుడూ అందుతూనే ఉంది. వారి రక్షణ
(మీరు ఎక్కడున్నా ఏం చేస్తున్నా నాకు తెలుసు అన్న విషయాన్ని గుర్తుంచుకోండి. - శ్రీసాయి.)

అన్నింటికీ మించి వారికి మనందరిపై ఉండే అవ్యాజ, అనన్య, అనంత ప్రేమ..
ఇవే మనల్ని ముందుకు నడిపించే గురువు అసలు స్వరూపం... ఇది గ్రహించి...
అనుగుణంగా వర్తించే వారితో, వారిలో, వారుగా ఉన్నారు. అలా వారు చూపిన బాటన
నడవడమే. అలా జీవనయానం సాగించడమే మన 'గురువు'కు మనం చేయవలసిన ఆరాధన.

అలా అందరం గురువు చూపిన సాయిపథం అనే ఆనందపథంలో, స్పష్టతతో,
ఒకే దృక్పథంతో, ఒకే వెలుగుగా
సాయివంటి దైవంబు లేడోయి.. లేడోయి... అంటూ అందరం ఒకే మాటగా,
ఒకే బాటలో కలసి నడుద్దాం...

ప్రగతిపథమైన గురుపథంలో మన పయనం సాగిననాడే... వారు ఆశించిన పరివర్తన, పరిణితులు
(బాబా కోరికలు తీర్చడంలో... వారు ఆశించినది మనలో పరివర్తననే!)
పొందిననాడే మన జీవితంలో ఉత్సవం..
అదే మన గురువుకు చేసే నిజమైన ఆరాధనోత్సవం.